



ముసలిమడుగులోని
ఎలిఫెంట్ క్యాంపు చుట్టూ ఏర్పాటు చేసిన కందకాలు



ఎలిఫెంట్ క్యాంపులో
సరదాగా కుంకీలు



కుంకీలొచ్చినా..!

కొనసాగుతున్న గజదాడులు

- ఆరునెలల నుంచి పులిచెర్ల మండలంలో దాడులు జరగని రోజే లేదు
- అటవీశాఖలో చలనం లేదంటూ రైతుల ఆగ్రహం

పలమనేరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : చిత్తూరు జిల్లా రైతాంగానికి కునుకు లేకుండా చేస్తున్న ఏనుగుల దాడులను అరికట్టేందుకు తీసుకొచ్చిన కుంకీ ఏనుగులు అలంకారప్రాయమేనా అన్న అభిప్రాయాలు బాధిత రైతుల్లో వ్యక్తమవుతున్నాయి.గత ఏడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఏనుగుల దాడులను అరికట్టేందుకు కుంకీ(శిక్షణ పొందిన) ఏనుగులను తీసుకొచ్చే ప్రయత్నాలు చేపట్టింది.కర్ణాటకలో విజయవంతమైన ఈ ప్రయోగాన్ని ఇక్కడ చేపట్టేందుకు అటవీ శాఖ మంత్రి అయిన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవ తీసుకున్నారు.. కర్ణాటక ప్రభుత్వంతో అటవీశాఖ అధికారులతో కలిసి చర్చలు జరిపారు.కుంకీ ఏనుగులను పంపేందుకు కర్ణాటక ప్రభుత్వం అంగీకరించడంతో వాటి నిర్వహణ కోసం ఇక్కడి అటవీశాఖ అధికారులను, సిబ్బందిని కర్ణాటకకు పంపి శిక్షణ కూడా ఇప్పించారు.పలమనేరు మండలంలోని మొసలిమడుగు గ్రామ సమీపంలో కుంకీల నివాసానికి ఏర్పాట్లు చేశారు.ఏడాది కాంలో ఎలిఫెంట్‌క్యాంపుకు సంబంధించి అటవీశాఖ లక్షలాది రూపాయలను వెచ్చించింది.ఎలిఫెంట్ క్యాంపు చుట్టూ అటవీ ప్రాంతంనుంచి ఏనుగులు లోనికి రాకుండా కందకాలు తవ్వించారు.క్యాంపు చుట్టూ హ్యాంగింగ్ సోలార్ కంచె ఏర్పాటు చేశారు.కుంకీలకు వైద్యసేవలు అందించేందుకు ఒక పశువైద్య అధికారిని నియమించారు, కుంకీలకు ఆహారం తయారు చేసేందుకు ఒక వంటగది, వంట మనుషులను ఏర్పాటు చేశారు. కుంకీలను సంరక్షించే మావటీలకు నివాస సౌకర్యం కల్పించారు. కుంకీలకోసం ప్రత్యేక షెడ్డు నిర్మించడంతో పాటు వాటికి ఆహారం అందించడం కోసం దాదాపు 70 లక్షలతో ఏడాది కాలానికి టెండరు పిలిచారు. కుంకీక్యాంపు ప్రాంతాన్ని పర్యాటక ప్రదేశంగా కూడా తీర్చిదిద్దుతున్నారు. ఇక్కడి అటవీశాఖ అధికారులు ఏడాది కాలంగా తమ సమయాన్ని ఈ క్యాంపు పనులకే వెచ్చిస్తున్నారు. వీరే కాక ఏనుగులు పంటలపైకి వచ్చినపుడు వాటిని అటవీప్రాంతంలోకి మళ్లించేందుకు నియమించబడిన ఎలిఫెంట్ ట్రాకర్స్ సైతం కుంకీల క్యాంపు వద్దే చాలామంది వుంటూ వచ్చారు. క్యాంపు నుంచి కుంకీలను అవసరమైన ప్రాంతాలకు తరలించేందుకు ప్రత్యేక వాహనాలు కూడా సిద్ధం చేసి పెట్టారు. ఎలిఫెంట్ క్యాంప్ వద్ద సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేశారు.అంతేకాక క్యాంపుకు పడమటి వైపు అంతర్రాష్ట్ర రహదారికి అభిముఖంగా ప్రధాన ద్వారం కూడా ఏర్పాటు చేశారు.ఎలిఫెంట్ క్యాంపుకు ఈ ఏడాది మే నెలలో రెండు, జూన్ నెలలో రెండు కుంకీలను కర్ణాటక నుంచి తీసుకొచ్చారు.కర్ణాటక దుబేరా ఎలిఫెంట్ బేస్ క్యాంపు నుంచి వచ్చిన కుంకీలు ఇక్కడి వాతావరణానికి అలవాటు పడడానికి నెల రోజులు పట్టింది. 17 మంది మావటీలు కుంకీలను వారి స్వాధీనంలోకి తీసుకోడానికి మరో 40 రోజులు పట్టింది. మొత్తంగా 70 రోజుల శిక్షణ అనంతరం ఆపరేషన్ కుంకీని తొలిసారిగా ఆగస్టు ఒకటవ తేదీ సాయంత్రం నిర్వహించారు.టేకుమంద ప్రాంతంలో 8ఏనుగులు తిరుగుతున్నాయన్న సమాచారంతో కుంకీలు కృష్ణ, జయంత్, వినాయక్‌లను తీసుకెళ్లారు. 2వ తేదీ ఉదయానికి ఏనుగులను అటవీ సరిహద్దు ప్రాంతంలోకి పంపడంతో ఆపరేషన్ పూర్తయింది. దీంతో ఈ ప్రాంత రైతులు గజదాడులనుంచి తమ పంటలకు ఇబ్బందులు తప్పుతాయని ఆశపడ్డారు.అయితే ఇప్పటివరకు రెండు మూడు పర్యాయాలు మాత్రమే క్యాంపు నుంచి కుంకీలను చుట్టుపక్కల ప్రాంతాలకు అటవీశాఖ అధికారులు తీసుకురాగలిగారు.



ఎలిఫెంట్ క్యాంపు చుట్టూ
హ్యాంగింగ్ సోలార్
విద్యుత్ కంచె

రోజూ దాడులు జరుగుతున్నా....

చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలంలో మూడేళ్లుగా పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతున్నాయి. ఆరు నెలల నుంచి అయితే రోజూ ఎక్కడో ఒకచోట చేతికొచ్చిన పంటలను ఏనుగులు నాశనం చేస్తూనే వున్నాయి. ఈ ఒక్క మండలంలోనే 224 హెక్టార్ల వరి,110 హెక్టార్ల టమోటా,200 హెక్టార్ల మామిడి పంటలతో పాటు 600 కొబ్బరి చెట్లు ఏనుగుల దాడిలో దెబ్బతిన్నాయి.పలు గ్రామాలకు చెందిన రైతులు పంటలు నష్టపోయి వ్యవసాయమంటేనే విరక్తి పుట్టే దశకు చేరుకున్నారు. రొంపిచెర్ల, సోమల, బంగారుపాళ్యం, గంగవరం, పలమనేరు,చంద్రగిరి మండలాల్లో కూడా ఏనుగులు పంటలను నాశనం చేస్తున్నాయి. అయినా కుంకీ ఏనుగులను రంగంలోకి దించి గజదాడుల కట్టడికి అధికారులు చర్యలు తీసుకోలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఈ కుంకీల కోసం ఇప్పటివరకు పెట్టిన ఖర్చు సత్ఫలితాలిస్తున్న హ్యాంగింగ్ సోలార్ విద్యుత్ కంచెపై పెట్టివుంటే రైతులకు ఎంతోకొంత ప్రయోజనం కలిగేదంటుంటున్నారు.ప్రభుత్వం సోలార్ కంచె ఏర్పాటు చేయకపోయినా 90 శాతం సబ్సిడీ ఇస్తే తామే ఏర్పాటు చేసుకునేందుకు సిద్ధమంటున్నారు.

క్యాంపు చుట్టూ పెరిగిన గజ సంచారం

మొసలిమడుగు సమీపంలో ఏర్పాటు చేసిన ఎలిఫెంట్ క్యాంపులో ఉన్న కుంకీల వాసనను పసిగట్టిన సమీప అటవీ ప్రాంతంలో వున్న ఏనుగులు ఇప్పటికే పలుమార్లు క్యాంపులోకి ప్రవేశించేందుకు ప్రయత్నం చేశాయి.ఒంటరి ఏనుగు క్యాంపు ప్రధాన ద్వారం వద్దకు వచ్చి లోనికి వెళ్లేందుకు ప్రయత్నించి చివరకు ప్రధాన ద్వారం ఒకవైపు కట్టిన గోడను తోసివేసింది. ఈ సంఘటన అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో కూడా రికార్డయింది.కుంకీ ఏనుగుల క్యాంపు ఏర్పాటు చేసినప్పటి నుంచి పరిసరాల్లో ఏనుగుల సంచారం పెరిగిందని రైతులు చెబుతున్నారు. తమ పంటలను తరచూ నాశనం చేస్తున్నాయని వాపోతున్నారు.

ఆపరేషన్ కుంకీకి పరిస్థితులు అనుకూలించలేదు



- డీఎఫ్‌వో సుబ్బరాజు

చిత్తూరు సెంట్రల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం అటవీ పరివాహక ప్రాంతాల్లో తిరుగాడుతున్న ఏనుగుల కట్టడికి అవసరమైన ఆపరేషన్ కుంకీకి తాము సిద్ధమే కానీ అక్కడి పరిస్థితులు అనుకూలించడం లేదని డీఎఫ్‌వో సుబ్బరాజు చెప్పారు.శుక్రవారం ఆయన ఆంధ్రజ్యోతి ప్రతినిధితో మాట్లాడుతూ పలమనేరు, కుప్పం, పుంగనూరు అటవీ సరిహద్దు ప్రాంతాలతో పాటు పులిచెర్ల, రొంపిచెర్ల, సదుం, సోమల మండలాల్లో ఏనుగుల కదలికలను నిశితంగా పరిశీలిస్తున్నామన్నారు.అటవీ సిబ్బంది రౌండ్ ది క్లాక్ విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. అయితే కల్లూరు ప్రాంతంలోని ఏనుగుల గుంపు బలం పుంజుకున్నాయని, ఈ పరిస్థితిలో కుంకీలను అక్కడ ప్రయోగించలేమన్నారు. ఒకటో, రెండో, మహా అయితే ఐదు ఏనుగుల వరకూ తిరుగాడుతుంటే కుంకీల సాయంతో వాటిని అడవుల్లోకి పంపవచ్చన్నారు. ప్రస్తుతం కల్లూరు ప్రాంతంలో 17 ఏనుగులు గుంపుగా తిరుగుతుండడంతో కుంకీలను ప్రయోగించలేకపోతున్నామని చెప్పారు. ఒకవేళ ప్రయోగిస్తే కుంకీలతో పాటు మావటీల ప్రాణాలకు కూడా ప్రమాదం వాటిల్లే అవకాశముందన్నారు. గుంపులోని ఏ రెండు ఏనుగులైనా కలిసి కుంకీపై దాడి చేసే ప్రమాదముందన్నారు. ఇది చూసి మిగిలినవి కూడా వాటితో జతకట్టి, కుంకీ ఏనుగులతో పాటు మావటీలను కూడా చంపే అవకాశాలున్నాయన్నారు.లేదా మావటీల కమాండ్‌ను విస్మరించి కుంకీలు అటవీ ప్రాంతంలోని ఏనుగులతో జతకట్టి వెళ్లిపోయే అవకాశాలు కూడా వున్నాయన్నారు.

వారంలో అందుబాటులోకి గజ-ప్రజ యాప్

గజదాడుల ద్వారా జరిగే నష్టాన్ని రైతులకు నేరుగా తెలియజేసి, త్వరితగతిన వారు నష్టపరిహారం పొందేందుకు అటవీ శాఖ తయారు చేసిన గజ-ప్రజ యాప్ వారం రోజుల్లో అందుబాటులోకి రానుందని డీఎఫ్‌వో సుబ్బరాజు చెప్పారు.గూగుల్ అనుమతి వచ్చాక ప్లే స్టోర్ ద్వారా రైతులకు అందుబాటులో వస్తుందన్నారు. యాప్ వినియోగంపై ఇప్పటికే అటవీ, వ్యవసాయ, ఉద్యాన, రెవెన్యూ శాఖల అధికారులతో పాటు అటవీ సరిహద్దు ప్రాంతాల్లోని రైతులకు అవగాహన కల్పించామని వివరించారు.




కల్లూరు ఉన్నత పాఠశాలలో వందేమాతరం అక్షరాలఆకారంలో కూర్చున్న విద్యార్థులు

మార్మోగిన వందేమాతరం

వందేమాతరం గేయాన్ని రచించి 150 సంవత్సరాలైన సందర్భంగా శుక్రవారం జిల్లాలోని పాఠశాలల్లో సామూహిక వందేమాతరం గీతాలాపన జరిగింది. వందేమాతరం ప్రాముఖ్యతను విద్యార్థులకు ప్రముఖులు వివరించారు. వందేమాతరం వంటి గేయాలు నాటి ప్రజల్లో ఎంతో స్ఫూర్తిని నింపుతూ దేశ స్వాతంత్ర్యోద్యమానికి దోహదపడ్డాయన్నారు. అనంతరం టీవీలో ప్రధాని మోదీ ప్రసంగాన్ని వీక్షించారు.

- చిత్తూరు సెంట్రల్, ఆంధ్రజ్యోతి



కుప్పంలో పరిశ్రమలకు నేడు సీఎం శంకుస్థాపన

కుప్పం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో ఏర్పాటు చేయనున్న పలు పరిశ్రమలకు శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు వర్చువల్ పద్ధతిలో శంకుస్థాపన చేయనున్నారు. సుమారు రూ.2203 కోట్ల పెట్టుబడితో 7 పరిశ్రమలు కుప్పానికి రానున్నాయి. ఆదిత్య బిర్లా రూ.586 కోట్లు , ఏస్ ఇంటర్నేషనల్ రూ.525 కోట్లు, ఎస్వీఎఫ్ సోయా రూ.72 కోట్లు, మదర్ డెయిరీ రూ.260 కోట్లు, శ్రీజ రూ.233 కోట్లు, ఈ రాయిస్ రూ.200 కోట్ల పెట్టుబడితో పరిశ్రమలను కుప్పంలో స్థాపించడానికి ముందుకొచ్చాయి. ఈ పరిశ్రమలను ముఖ్యమంత్రి చంద్రబాబు వర్చువల్‌గా ప్రారంభిస్తారు. ఆయా పరిశ్రమల ద్వారా నియోజకవర్గంలో ఏకంగా 22 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయని అంచనా వేశారు. కుప్పం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు కూడలి ఎన్టీఆర్ విగ్రహం ఎదుట వర్చువల్ శంకుస్థాపన కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేశ్‌బాబు, కడా పీడీ వికాస్ మర్మత్ కలిసి వీక్షించనున్నారు. అలాగే నియోజకవర్గంలోని నాలుగు మండల కేంద్రాలు, పంచాయతీ కేంద్రాలలో ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా ప్రజలు వీక్షించే ఏర్పాట్లను అధికారులు చేపట్టారు.

తేరుకోని కళత్తూరు

ముంపుగ్రామాల్లో ముమ్మరంగా సహాయక చర్యలు



బాధితులకు సాయం అందిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, ఆదిమూలం, టీడీపీ నేతలు

కేవీబీపురం/సత్యవేడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జల ప్రళయం సృష్టించిన బీభత్సం నుంచి కేవీబీపురం మండలం కళత్తూరు దళితవాడవాసులు ఇంకా తేరుకోలేదు. ఇళ్లలో బురద పేరుకుపోయి కొందరు, ధాన్యం, సామగ్రి పాడై మరికొందరు, దుస్తులు కొట్టుకుపోయి ఇంకొందరు.. ఇలా వీరి పరిస్థితి దైన్యంగా మారింది. ఒకవైపు సహాయక చర్యలు జరుగుతుంటే.. మరోవైపు సర్వం కోల్పోయిన బాధితులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. కేవీబీపురం మండలం పాతపాళెం రాయల చెరువు గురువారం ఉదయం తెగడంతో పాతపాళెం దళితవాడ, అరుంధతివాడ, ఓళ్లూరు దళితవాడ, కళత్తూరు దళితవాడల్లో తీవ్ర నష్టం వాటిల్లింది. ఆయా ప్రాంతాల్లో శుక్రవారం సహాయక చర్యలను ముమ్మరం చేశారు. నారాయణవనం, పిచ్చాటూరు, వరదయ్యపాళెం, సత్యవేడు, వడమాలపేట పంచాయతీలు.. శ్రీకాళహస్తి మున్సిపాలిటీ.. తిరుపతి కార్పొరేషన్ నుంచి 200 మందికిపైగా పారిశుధ్య సిబ్బంది.. శ్రీకాళహస్తి, సత్యవేడు, పుత్తూరు, తిరుపతి నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది సమన్వయంతో వీధుల్లో, ఇళ్లల్లో పేరుకుపోయిన బురద తొలగిస్తున్నారు. బురద తీసేందుకు 10 ఎక్స్‌కవేటర్లు వినియోగిస్తున్నారు. ఇళ్లల్లో బురద తీసేవరకు వండుకునే పరిస్థితి లేదు. ఇప్పటికే బురద వల్ల ఇళ్లలో దుర్వాసన వస్తోంది. బురదను, దుస్తులు, సామాన్లను కాలువల్లో పారుతున్న నీటితోనే మహిళలు శుభ్రం చేసుకుంటున్నారు. కచ్చా.. రేకుల ఇళ్లల్లో తేమ తగ్గాలంటే వారం రోజులు పట్టొచ్చు. అంటువ్యాధులు ప్రబలకుండా శ్రీకాళహస్తి, కేవీబీ పురం ప్రాంతాల నుంచి వైద్య సిబ్బంది గ్రామాల్లో శిబిరాలు నిర్వహించి వైద్య పరీక్షలు చేస్తున్నారు. మందులు అందిస్తున్నారు. ఇక, పశువుల కళేబరాలను ట్రాక్టర్లలో తరలిస్తుంటే రైతులు కుమిలిపోతున్నారు. ముంపునకు గురైన ఈ ప్రాంతాలు తేరుకుని సాధారణ స్థితికి రావాలంటే మరికొన్ని రోజులు పట్టే అవకాశం ఉంది.

ఇరిగేషన్ ఏఈ సస్పెన్షన్

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలం ఓళ్లూరు రాయలచెరువుకు గండి పడిన ఘటనలో ఇరిగేషన్ ఏఈ బాబును సస్పెండ్ చేస్తూ శుక్రవారం రాత్రి కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాలు జారీ చేశారు. చెరువుకు గండిపడకుండా ముందుగా తగిన జాగ్రత్తలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఈ చర్యలు చేపట్టారు. దీనిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని జిల్లా అధికారులను ఆదేశించారు.



సీసీ కెమెరాలో రికార్డయిన చిరుత

ఎస్వీయూలో చిరుత సంచారం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీలో మళ్లీ చిరుత సంచరించిన ఆనవాళ్లు కనిపించాయి. గురువారం రాత్రి పాపులేషన్ స్టడీస్- ఐ బ్లాక్ హాస్టల్ మధ్య కొత్త భవన నిర్మాణ ప్రాంతంలో కుక్కను తరిమిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. విద్యార్థులు, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు. అత్యవసరమైతే తప్ప రాత్రి వేళల్లో బయట సంచరించరాదని సూచించారు.

నేడు,రేపు పవన్ పర్యటన



పలమనేరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శని,ఆదివారాల్లో తిరుపతి, పలమనేరుల్లో పర్యటించనున్నారు. శనివారం ఉదయం 8 గంటలకు తిరుపతి విమానాశ్రయం చేరుకునే ఆయన అక్కడి నుంచి రేణిగుంట మండలంలోని మామండూరు ఎకో టూరిజం పార్కును సందర్శిస్తారు. సుమారు రెండు గంటల పాటు అక్కడే గడుపుతారు. దట్టమైన అటవీ ప్రాంతంలో జలపాతంతో కూడిన మామండూరు ఎకో టూరిజం పార్కు అభివృద్ధిపై సంబంధిత శాఖ అధికారులకు సూచనలు, ఆదేశాలు జారీ చేస్తారు. అక్కడ మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొంటారు. ఆపై తిరుపతి చేరుకుని మంగళంలోని ఎర్రచందనం గోదామును పరిశీలిస్తారు. అనంతరం తిరుపతి కలెక్టరేట్ చేరుకుని అధికారులతో సమావేశమవుతారు. మొక్కల పెంపకం మొదలుకుని ఎకో టూరిజం అభివృద్ధి, ఏనుగుల సమస్య, ఎర్రచందనం అక్రమ రవాణా, అభయారణ్యాల పరిధిలోనూ అలాగే సముద్ర, పులికాట్ తీర ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు అడ్డుగా ఉన్న అటవీ శాఖ ఆంక్షలు వంటి అంశాలపై సమావేశంలో సమీక్షిస్తారు. మధ్యాహ్నం 3.30 గంటలకు విజయవాడకు తిరుగు ప్రయాణమవుతారు. 9వతేది ఉదయం 9 గంటలకు మంగళగిరి నుంచి బయల్దేరి 10 గంటలకు తిరుపతి విమానాశ్రయంకు చేరుకుంటారు. అక్కడినుంచి హెలికాప్టర్‌లో పలమనేరు సమీపంలోని పెంగరగుంట వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు 10.35 గంటలకు చేరుకుంటారు. అక్కడినుంచి కారులో ముసలిమడుగు ఎలిఫెంట్ క్యాంపుకు 10.50 గంటలకు చేరుకొంటారు. 12.35 గంటల వరకు ఎలిఫెంట్‌క్యాంపు వద్ద పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు.మ్యాన్-యానిమల్ కాన్ఫ్లిక్ట్ మేనేజ్‌మెంట్ ప్రజంటేషన్‌లో పాల్గొంటారు. ఆపై కుంకీ ఏనుగుల శిక్షణ ప్రాంతాన్ని పరిశీలిస్తారు. అక్కడే పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేస్తారు. తరువాత మంగళగిరికి తిరుగుప్రయణమవుతారు.

గుడిపాలలో 64.6 మి.మీ వర్షపాతం

చిత్తూరు సెంట్రల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం ఉదయం 8 గంటల నుంచి శుక్రవారం ఉదయం 8 గంటల వరకు పలు మండలాల్లో వర్షపాతం నమోదైంది. అత్యధికంగా గుడిపాల మండలంలో 64.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయ్యింది. చిత్తూరు రూరల్‌లో 54.2, విజయపురంలో 46.8, జీడీ నెల్లూరులో 33.8, యాదమరిలో 30.2, పూతలపట్టులో 27, రొంపిచెర్లలో 24.2, కుప్పంలో 23.2, నగరిలో 23, సోమలలో 18.4, పాలసముద్రంలో 14.4, పెనుమూరులో 14.8, నింద్రలో 14.2, శాంతిపురంలో 12.4, రామకుప్పంలో 12.2, బంగారుపాళ్యంలో 19.2, తవణంపల్లెలో 8.2, గంగవరంలో 7.4, గుడుపల్లెలో 6.8, చౌడేపల్లెలో 6, చిత్తూరు అర్బన్‌లో 5.4 పులిచెర్లలో 4.6, వి.కోటలో 4, పలమనేరులో 3.3, పుంగనూరు, సదుం మండలాల్లో 2.2, పెద్దపంజాణిలో 1.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

శ్రీవారిసేవలో ప్రముఖులు



నీలం సాహ్ని - దివి

తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఏపీ ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నీ, సెంట్రల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ నవీన్, శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, సినీనటి దివి ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.


- తిరుమల, ఆంధ్రజ్యోతి

'మిట్స్'లో 5,6 తేదీల్లో పాలిటెక్నిక్ అధ్యాపకుల జాతీయసదస్సు

పోస్టర్ ఆవిష్కరించిన ఆర్జేడీ నిర్మల్‌కుమార్ ప్రియా

తిరుపతి(విద్య), నవంబరు7 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లెలోని మిట్స్ డీమ్డ్ టుబీ యూనివర్సిటీలో డిసెంబరు 5, 6 తేదీలలో దేశవ్యాప్తంగా ఉన్న పాలిటెక్నిక్ కళాశాలల అధ్యాపకులకు అవుట్‌కమ్ బేస్ట్ ఎడ్యుకేషన్‌పై జాతీయ సదస్సు జరగనుంది. ఈ సదస్సుకు సంబంధించి పోస్టర్లను శుక్రవారం తిరుపతిలోని సాంకేతికవిద్య కార్యాలయంలో ఆర్జేడీ నిర్మల్‌కుమార్ ప్రియా, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాశ్‌కుమార్, మిట్స్ ప్రతినిధులు జి.శ్రీనివాసులు, కేఎండీ రియాజ్ అలీ ఆవిష్కరించారు. పాలిటెక్నిక్‌లలో ఆఫర్ చేస్తున్న కోర్సులకు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్(ఎన్‌బీఏ) ఎంతో ప్రధానమని ఆర్జేడీ చెప్పారు. ఇందులో భాగంగా అవుట్ కమ్ బేస్ట్ ఎడ్యుకేషన్‌పై అధ్యాపకులకు అవగాహన పెంచేందుకు ఈసదస్సు నిర్వహిస్తున్నామని వివరించారు. బోధనలో నాణ్యత పెంపు, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులకు అందించడం ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు. దీన్ని అధ్యాపకులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 5 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.52 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 61,718


తలనీలాలు సమర్పించినవారు: 21,937

హస్తకళావిలాసం
గాంధీ శిల్పబజార్

● శిల్పారామంలో 9 దాకానే



తిరుపతి శిల్పారామంలో దేశంలోని విభిన్న హస్తకళలు కొలువుతీరాయి. కళాకారులే స్వయంగా ఇక్కడ తమ ఉత్పత్తులను విక్రయిస్తున్నారు. 'గాంధీ శిల్ప బజార్ 2025' పేరుతో ఈ నెల 4న తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఈ ప్రదర్శన ప్రారంభం అయ్యింది. కేంద్ర ప్రభుత్వం, కళా సృష్టి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో దీనిని నిర్వహిస్తున్నారు. ఈ నెల 9 దాకా ఈ ప్రదర్శన ఉంటుంది. ఉదయం 10 నుంచి రాత్రి 8గంటల వరకు సందర్శించవచ్చని శిల్పారామం ఏవో సుధాకర్ తెలిపారు. అరుదైన ఎన్నో కళాకృతులు ఇక్కడ లభిస్తున్నాయి. కొన్ని స్టాల్స్‌లో కళాకారులు స్వయంగా తమ ఉత్పత్తులను తయారు చేస్తూ కనిపిస్తారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులతో మాట్లాడే అరుదైన అవకాశం ఇక్కడికి వెళ్తే లభిస్తుంది.



- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి



పుదుచ్చేరి ప్రత్యేకం



పుదిచ్చేరికి చెందిన రాహుల్ కుటుంబం గడచిన 40 ఏళ్లగా కొబ్బరిచెట్టు నుంచి వివిధ కళాకృతులను తయారు చేస్తోంది. కొబ్బరి చిప్పలతో లైటింగ్ ల్యాంప్స్, పిల్లల ఆట వస్తువులు ఈ స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా ఉన్నాయి.

కాశ్మీర్ చీరలు



గాంధీ శిల్పబజార్‌లో కాశ్మీరీ శారీస్ విస్తృతంగా అమ్ముడు పోతున్నాయి. కాశ్మీర్‌కు చెందిన సఫత్ హుస్సేన్ కుటుంబం గడచిన కొన్ని తరాలుగా ప్రత్యేక ఊలుతో చీరలు తయారు చేసి విక్రయిస్తోంది. చాలా అందమైన డిజైన్లలో ఇవి లభిస్తున్నాయి. ధరలు రూ.2వేలు నుంచి రూ.లక్ష వరకు ఉన్నాయి.







మహాబలిపురం ముత్యాలు





మహాబలిపురంకి చెందిన కళాకారుడు కృష్ణన్ స్టాల్‌లో సముద్రంలో సహజసిద్ధంగా దొరికే ఆలుచిప్పలు, ముత్యాలు, పగడాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. ఒరిజనల్ ముత్యాలు, పగడాలు విక్రయించడం వీరి ప్రత్యేకత. పలు ఆభరణాలు ఉన్నాయి. ఇక చిన్న చిన్న రాతి విగ్రహాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

ఎల్లప్ప టెర్రకోట బొమ్మలు



పలమనేరుకు చెందిన ఎల్లప్ప మట్టితో తయారుచేసిన 500 రకాల టెర్రకోట బొమ్మలు ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా ఉన్నాయి. రకరకాల బొమ్మలు, వాటర్ బాటిల్స్ దీపాలు వంటి మట్టి కళాఖండాలు ఇక్కడ ఉన్నాయి. టెర్రకోట కళాకారుడు ఎల్లప్పకు గతంలో జాతీయ అవార్డు కూడా లభించింది.



● ధర్మవరంకు చెందిన జనార్ధన్ కుటుంబం తయారు చేస్తున్న లెదర్‌పెయింట్స్, డోర్ హ్యాంగిల్స్, లైటింగ్ ల్యాంప్స్ విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

● దేవదారుచెక్కతో వంట సామాగ్రి, వెదురుతో చేసి నీళ్ల గ్లాసులు, టీకప్పులు ఇక్కడ లభిస్తున్నాయి.

● పెన్ కలంకారీకి మన శ్రీకాళహస్తి ప్రసిద్ధి అయితే, బ్లాక్ ప్రింటింగ్‌కి పెడన ప్రత్యేకం. పెడనకు చెందిన జీవన కుమార్ బ్లాక్ ప్రింటింగ్‌లోని కలంకారీ షర్ట్స్, చీరలు, చున్నీలు విక్రయిస్తున్నారు.



తెల్లజిల్లేడుతో వినాయక విగ్రహాలు

తెల్లజిల్లేడుతో తయారుచేసిన వినాయక బొమ్మలకు మార్కెట్‌లో బహు గిరాకీ ఉంది. జీడీనెల్లూరుకు చెందిన త్యాగరాజులు 20 ఏళ్లగా తెల్లజిల్లేడుతో వినాయక ప్రతిమలను రూపొందించడంలో దిట్ట. ఈ స్టాల్‌లో రూ.120 నుంచి తెల్లజిల్లేడు విగ్రహాలను విక్రయిస్తున్నారు. తెల్లజిల్లేడుతో చేసిన కీచైన్స్ ఆకట్టుకుంటున్నాయి.







ఎర్రచందనం స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు

● రూ.6 లక్షల జరిమానా

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): శేషాచలం అడవుల నుంచి ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పోలీసులకు పట్టుబడిన స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.6 లక్షల జరిమానా విధిస్తూ తిరుపతి ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి శుక్రవారం తీర్పునిచ్చారు. తమిళనాడు రాష్ట్రం వేలూరుకు చెందిన ఎస్.గుణశేఖర్ 2016లో నాగపట్ల ఈస్ట్ బీట్, చామలరేంజ్ పరిధిలో ఎర్రచందనం దుంగలను తమిళనాడుకు తరలిస్తుండగా అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. అరెస్టు చేసి కోర్టు ఎదుట హాజరుపరచగా రిమాండ్ విధించింది. తర్వాత బెయిల్‌పై ఇతడు బయటకు వచ్చాడు. గత తొమ్మిది సంవత్సరాలుగా వివిధ దశల్లో విచారణలో ఉన్న కేసును రాష్ట్ర స్థాయి ఎర్రచందనం కోర్టుకు బదిలీ చేశారు. ఏడాదిపాటు విచారణ జరిగింది. గుణశేఖర్‌పై సాక్ష్యాధారాలు నిరూపణ కావడంతో ప్రాసిక్యూషన్ వాదనలు విన్న తర్వాత నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.ఆరు లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. అనంతరం నిందితుడ్ని నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు.

ప్రజాప్రతినిధుల పీఆర్వోలు టికెట్లు అమ్ముకుంటున్నారు

● డయల్ యువర్ ఈవోలో భక్తుడి ఫిర్యాదు



డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో పాల్గొన్న ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అధికారులు

తిరుమల, నవంబరు7(ఆంధ్రజ్యోతి): తిరుమలలో కొంతమంది ప్రజాప్రతినిధుల పీఆర్వోలు అధిక ధరలకు వీఐపీ బ్రేక్ దర్శనాలను అమ్ముకుంటున్నారని ఈశ్వర్(అనంతపురం) అనే భక్తుడు ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌కు ఫిర్యాదు చేశారు. డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో శుక్రవారం పలువురు భక్తులు ఈవోతో ఫోన్‌లో సంభాషించారు. ఈ సమయంలో ఈశ్వర్ మాట్లాడుతూ ఒక టికెట్‌ను రూ.5 వేల నుంచి రూ.6 వేలకు అమ్ముతున్నారని చెప్పారు. ఇటువంటి వారిని కట్టడి చేయలని కోరారు. దళారీలపై ఫిర్యాదులు వస్తున్నాయని,విజిలెన్స్ విభాగం చర్యలు తీసుకుంటోందని ఈవో సమాధానం ఇచ్చారు. భక్తులు కూడా దళారీలను ఆశ్రయించకుండా టీటీడీ అధికారిక వెబ్‌సైట్, కౌంటర్ల ద్వారానే టికెట్లు, టోకెన్లు పొందాలని సూచించారు.

డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి 17 మంది భక్తులు ఈవోతో ఫోన్‌లో మాట్లాడారు. దర్శన సమయంలో ఆలయంలోని శ్రీవారిసేవకులు లాగేస్తున్నారని, దర్శన టికెట్ల బుకింగ్ సమయంలో ఓటీపీ ఆలస్యంగా వస్తోందని మణికంఠ(అనంతపురం) ఫిర్యాదు చేశారు. ఓటీపీ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని, అలాగే భక్తులతో మెలిగే విధానంపై శ్రీవారిసేవకులకు శిక్షణా కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించామని ఈవో బదులిచ్చారు. 2023లో ఇంజినీరింగ్ విభాగంలో ఉద్యోగాల నోటిఫికేషన్ ఇచ్చారని, కానీ ఇప్పటికీ ఎలాంటి నియామకాలు జరగలేదని గణేష్(కడప) ఈవో దృష్టికి తీసుకురాగా, 15 రోజుల్లోనే ఈ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దివ్యాంగులు, వృద్ధులకు ఆఫ్‌లైన్‌లోనూ టోకెన్లు కేటాయిస్తామని బోర్డు ప్రకటించినప్పటికీ చర్యలు తీసుకోలేదని జగన్(జగిత్యాల) తెలుపగా, భక్తుల అభిప్రాయ సేకరణ, కమిటీ సిఫార్సుల మేరకు త్వరలోనే నిర్ణయాలు తీసుకుంటామని ఈవో అన్నారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు వంటి ప్రముఖుల సూచనలను దృష్టిలో పెట్టుకుని వీఐపీలు ఏడాదిలో కొన్ని సార్లు మాత్రమే దర్శనం చేసుకునేలా చూడాలని మునిలక్ష్మి(తిరుపతి) కోరారు.

బుకింగ్ సమయంలో ఆధార్ అప్‌లోడింగ్ సమస్య

దర్శన టికెట్లు, టోకెన్ల బుకింగ్ సమయంలో ఆధార్ అప్‌లోడ్ చేసేలోపు కోటా పూర్తయిపోతోందని హరిణి అనే భక్తురాలి ఫిర్యాదుపై ఈవో బదులిస్తూ.., బుకింగ్ సమయంలో మళ్లీ ఆధార్ అప్‌లోడ్ చేసే అవసరం లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే పేమెంట్ సమయంలో క్రెడిట్, డెబిట్ కార్డులు ఉపయోగించే అవసరం లేకుండా ఆర్బీఐ సూచించిన యూపీఐ, వ్యాలెట్ ద్వారా చెల్లించే అంశాలను కూడా ఐటీ అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

హత్యాయత్నం కేసులో పదేళ్ల జైలు

చిల్లకూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మహిళపై హత్యాయత్నం కేసులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ నెల్లూరు 8వ జిల్లా జడ్జి తీర్పు ఇచ్చినట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. మండలంలోని తిక్కవరం గ్రామానికి చెందిన వీరరాఘవయ్య ఆస్తి వివాదాల నేపథ్యంలో తన బావమరిది భార్య వెంకటలక్ష్మిపై 2017లో హత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో నేరం రుజువుకావడంతో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శుక్రవారం తీర్పు ఇచ్చారు.



● చిత్తూరులో జోయాలుక్కాస్

బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో

ప్రముఖ జోయాలుక్కాస్ సంస్థ చిత్తూరులో 'బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో'ను ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో వినియోగదారులతో పాటు ఏఎస్పీ రాజశేఖర్ రాజ్, నటి దివి వాడ్యా, రిటైల్ హెడ్ రాజేష్ కృష్ణన్, రీజనల్ మేనేజరు శ్రీజేష్ తదితరులు పాల్గొన్నారు.

వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాలతో రూ.72 లక్షల రుణాలు

● జిల్లా సహకార బ్యాంకు సీఈవోకు సింగిల్ విండో అధ్యక్షుడి ఫిర్యాదు

భాకరాపేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాలు తనఖా పెట్టి రూ.72 లక్షల రుణాలు పొందారని సింగిల్ విండో అధ్యక్షుడు ముత్తం ప్రభాకర్ ఆరోపించారు. దీనిపై విచారణ జరిపించాలని జిల్లా సహకార బ్యాంకు సీఈవోకు ఫిర్యాదు చేశారు. 2020 మార్చి నుంచి 2025 ఆగస్టు వరకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఆర్థిక లావాదేవీలలో అవకతవకలు జరిగాయని, ఈ నెల 4న డీసీసీ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ బంగారును పరిశీలించగా అందులో వన్ గ్రాము గోల్డ్ ఆర్నమెంట్స్ ఉన్నాయని గుర్తించారు. కె.రెడ్డమ్మ, సి.రుతున్ పేర్లతో 2025 జనవరి 18, 21న, ఫిబ్రవరి 11వ తేదీలలో ఈ ఆభరణాలు పెట్టినట్లు ఉంది' అని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

తిరుచానూరు వరకే మెము

పెరంబూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరుపతి వెళ్లే నాలుగు మెము రైళ్లు గురువారం నుంచి ఫిబ్రవరి 5వ తేది వరకు తిరుచానూరు వరకే నడుస్తాయి. అరక్కోణం నుంచి ఉదయం 9.15 గంటలకు వెళ్లే రైలు తిరుచానూరు వరకే వెళ్తుంది. ఇక, సాయంత్రం 3.40 గంటలకు తిరుచానూరు నుంచే అరక్కోణం బయల్దేరుతుంది. చెన్నై సెంట్రల్ నుంచి ఉదయం 9.50 గంటలకు వెళ్లే రైలు తిరుచానూరులోనే ఆగుతుంది. అక్కడ్నుంచే మధ్యాహ్నం 1.25 గంటలకు బయలుదేరుతుంది.

ప్రకృతి అందాల మామండూరు

● మరింత అభివృద్ధి చేస్తే పెరగనున్న సందర్శకులు

● నేడు డిప్యూటీ సీఎం పర్యటన



గుంటి మడుగు వాచ్ టవర్‌కు వెళ్లే మార్గం

రేణిగుంట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతంలో.. ప్రకృతి అందాల నడుమ ఉన్న మామండూరు పర్యాటక కేంద్రంలో మరిన్ని వసతులు కల్పిస్తే సందర్శకుల సంఖ్య పెరుగుతుంది. ప్రముఖ పర్యాటక ప్రాంతంగా విరాజల్లితుంది. శనివారం రేణిగుంట మండలంలోని మామండూరును సందర్శించనున్న అటవీశాఖ మంత్రి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈ దిశగా చర్యలు చేపట్టాలని పర్యాటకులు కోరుతున్నారు. సెలవు దినాల్లో 700కుపైగా.. సాధారణ రోజుల్లో 130 మంది వస్తున్నారు. ప్రస్తుతానికి 6 కాటేజీలున్నాయి. ఇక, అన్ సీజన్ అయిన ఎండాకాలంలో సందర్శకుల శాతం పెంచేందుకు రిసార్టులు, పిల్లలు ఆడుకునేలా పార్కులు ఏర్పాటు చేయాలి. వారాంతపు సెలవు దినాల్లో ఎక్కువ మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు శేషాచలం అటవీ ప్రాంతాల్లో అడ్వెంచర్ల కోసం వస్తుంటారు. వీరికోసం ప్రకృతి బాట నుంచి అభివృద్ధి చేస్తే ఎక్కువగా వస్తారు. ఇక, మామండూరు గెస్ట్‌హౌస్ నుంచి గుంటిమడుగు వద్ద వాచ్‌టవర్‌పై నుంచి ప్రకృతి అందాలు చూడొచ్చు. ఇక, గంటి మడుగు జలపాతంలో ఎప్పుడూ నీళ్లు ప్రవహిస్తుంటాయి. ఇక్కడికి సందర్శకులను అనుమతించడంలేదు. కొన్ని జాగ్రత్తలు తీసుకుని అనుమతించాలని కోరుతున్నారు. షికారి లైన్, వెద్దురు, మల్లేరు వంక, బ్రహ్మదేవుని గుండం, ఉడగమనుదొడ్డి బేస్ క్యాంప్ ప్రాంతాలకు రోడ్డువేసి జంగిల్ సఫారీకి అనుమతిస్తే సందర్శకులు పెరుగుతారు. శని, ఆదివారాల్లో మామండూరు గెస్ట్‌హౌస్ వరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తే సందర్శకులకు అనుకూలంగా ఉంటుంది. ఇలా సందర్శకులు పెరిగేలా జిల్లా అధికారుల సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోవాలన్నది పర్యాటకుల కోరిక.

పవన్ పర్యటనకు భారీ భద్రత

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మూడు కార్యక్రమాలు.. తొమ్మిది గంటల పాటు సాగే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటనకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పీ సుబ్బరాయుడు పర్యవేక్షణలో నలుగురు అదనపు ఎస్పీలు, ఆరుగురు డీఎస్పీలు, 25 మంది సీఐలు, 50 మంది ఎస్ఐలు, మరో 300 మంది ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్ళు, రోప్ పార్టీలు, రిజర్వు బలగాలు, డాగ్, బాంబు స్క్వాడ్‌లు, రోడ్డు డిగ్గింగ్ పార్టీలు, అటవీశాఖ అధికారులు బందోబస్తు విధుల్లో పాల్గొంటారు. మామండూరు అటవీ ప్రాంతంలో పవన్ పర్యటన ఉండటంతో మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు.

తిరుపతిలో గంజాయి బ్యాచ్ వీరంగం

● ఆరు కార్లు, విద్యుత్ శాఖ సబ్ స్టేషన్ కార్యాలయ అద్దాలు ధ్వంసం

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో గురువారం అర్ధరాత్రి గంజాయి బ్యాచ్ వీరంగం చేసింది. సింగాలగుంటలో దాదాపు ఐదారు గంటల పాటు ఆరుగురు యువకులు, విద్యార్థులు హల్‌చల్ చేశారు. కనకభూషణ లేఅవుట్‌లో ఆరు కార్లు అద్దాలు ధ్వంసం చేశారు. పక్కనే వున్న విద్యుత్ శాఖ సబ్‌స్టేషన్ కార్యాలయ కిటికీ అద్దాలు, తలుపులు ధ్వంసం చేశారు. సబ్ స్టేషన్ నైట్ షిఫ్ట ఆపరేటర్ రేవంత్‌కుమార్ ఫిర్యాదు మేరకు అలిపిరి పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. చెన్నారెడ్డి కాలనీకి చెందిన ప్రవీణ్, విఘ్నేష్, వేణు ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. అదే ప్రాంతానికి చెందిన ఇద్దరు పదో తరగతి చదువుతున్నారు. మరొకరి వివరాలు తెలియదు. స్నేహితులైన వీరికి మూడు నెలల క్రితం కొంతమంది ప్రత్యర్థులతో గొడవ జరిగింది. దీంతో వారిని టార్గెట్‌గా చేసుకుని కొద్ది రోజులుగా వీరు కనకభూషణ లేఅవుట్‌లో మద్యం మత్తులో హల్‌చల్ చేస్తున్నారు. కొందరు స్థానికులు వీరిని మందలించారు. మళ్లీ గురువారం రాత్రి గంజాయి, మద్యం తాగి.. బీరు బాటిళ్లతో నడి రోడ్డుపై బీభత్సం సృష్టించారు. సబ్‌స్టేషన్ కార్యాలయంపై దాడి చేసి తలుపులు, కిటికీల అద్దాలు పగలకొట్టారు. రోడ్లపై ఆపి వున్న ఆరు వాహనాల అద్దాలు ధ్వంసం చేశారు. దీనిపై డయల్ 112కు కొందరు సమాచారం ఇచ్చారు. డీఎస్పీ భక్తవత్సలం ఆదేశాల మేరకు ఎస్ఐలు లోకేషబాబు, అజిత, బ్లూకోల్ట్స్, రక్షక్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నిందితుల కోసం రెండు బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.





వృత్తి విద్య నైపుణ్య పోటీలు ప్రారంభం



వివిధ రకాల నమూనాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

చిత్తూరు సెంట్రల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్నతనం నుంచే నైపుణ్యాలను పెంచుకోవాలని డీఈవో వరలక్ష్మి, జిల్లా సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణ పిలుపునిచ్చారు. సమగ్రశిక్ష ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక జ్యోతిరావు ఫూలే భవనంలో నిర్వహించిన జిల్లా స్థాయి వృత్తి విద్య నైపుణ్య పోటీలను ఏపీసీ ప్రారంభించారు. 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న 446 మంది విద్యార్థులు.. వ్యవసాయం, ఆటోమోటివ్, అప్పెరల్, బ్యూటీ అండ్ వెల్‌నెస్, ఫుడ్ ప్రాసెసింగ్, బ్యాంకింగ్, ఫైనాన్స్, ఎలక్ట్రానిక్స్, ఐటీ ట్రేడ్ అంశాలపై రూపొందించిన నమూనాలు ప్రదర్శించారు. ప్రతి విభాగం నుంచి నాలుగు నమూనాలు రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు.

ఇద్దరు బైక్ దొంగల అరెస్టు



పట్టుబడ్డ నిందితులు, స్వాధీనం చేసుకున్న బైక్‌లతో పోలీసులు

చిత్తూరు అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బైక్‌లు దొంగతనాలు చేసే ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. రెండో పట్టణ ఎస్‌ఐ రమేష్‌బాబుతో కలిసి సీఐ నెట్టికంఠయ్య మీడియాకు వివరాలు తెలిపారు. ఇటీవల వరుసగా బైక్‌లు చోరీకి గురవుతున్నాయని ఫిర్యాదులు వచ్చాయి. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కట్టమంచి వైజంక్షన్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా మంగసముద్రం హౌసింగ్‌కాలనీకి చెందిన మహేష్, ధర్మరాజులు గుడి వీధికి చెందిన వసీంలను అనుమానంతో పట్టుకున్నారు. విచారించగా నేరాన్ని ఒప్పుకున్నారు. వీరు చోరీచేసిన రెండు బైక్‌లను కట్టమంచి షుగర్ ఫ్యాక్టరీ వద్ద ఉన్న ముళ్ల పొదల్లో దాడి ఉంచారని చెప్పడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

పాడి రైతులకు విరివిగా రుణాలివ్వాలి

కలెక్టర్ సుమిత్ కుమార్



ప్రసంగిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు సెంట్రల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పాడి రైతులకు విరివిగా రుణాలు ఇవ్వాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో పాడి రైతులకు రుణాలు అందజేయడంపై లబ్ధిదారుల ఎంపిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రజల జీవనోపాధి, స్థిరమైన ఆదాయం వచ్చేలా పశుసంవర్థక శాఖల అధికారులు పనిచేయాలని సూచించారు. ఏడీల ద్వారా వారి పరిధిలోని పాడి రైతుల్లో పాడి పరిశ్రమ, పౌల్ట్రీ రంగంలో ఆసక్తి ఉన్న రైతుల జాబితా సిద్ధం చేసి, బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించాలన్నారు. జిల్లాలో సుమారు 45 రకాల బ్యాంకుల సంబంధించి బ్రాంచీల్లో 4,300 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ ఏడాది పాడి రైతులకు రూ20 కోట్లు రుణాలు అందజేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశాలిచ్చారు. కాగా, బంగారుపాళ్యం, పెద్దపంజాణి, పి.కొత్తకోట మండలాల్లో పాడి రైతులకు అత్యధికంగా రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. పశుసంవర్థక శాఖ ఏడీ గోవిందయ్య, ఎల్‌డీఎం హరీష్, పశువైద్యాధికారులు, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

లారీ ఢీకొని యువకుడి మృతి

● మరొకరికి తీవ్ర గాయాలు



మృతిచెందిన భరత్

గంగవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పలమనేరు- మదనపల్లె రహదారిలో గంగవరం మండల పరిధిలోని కలగటూరు క్రాస్ వద్ద శుక్రవారం ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొని ఒకరు మృతి చెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు... మండలంలోని నల్లసానిపల్లె గ్రామానికి చెందిన జి.భరత్ (21) వెటర్నరీ అసిస్టెంట్‌గా ప్రైవేట్ ప్రాక్టీస్ చేస్తున్నాడు. శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి రెండు ద్విచక్రవాహనాలపై బోయకొండ గంగమ్మను దర్శించుకోవడానికి బయలుదేరారు. మార్గంమధ్యలో కలగటూరు క్రాస్ వద్ద ఎదురుగా వస్తున్న లారీ అదుపు తప్పి భరత్ ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో ద్విచక్రవాహనాన్ని నడుపుతున్న భరత్, వెనుక కూర్చొన్న కార్తీక్(30) తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు సంఘటనా స్థలం వద్దకు చేరుకొని వారిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో భరత్ మృతిచెందాడు. గాయపడిన కార్తీక్‌ను చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గంగవరం అర్బన్ సీఐ ప్రసాద్ తెలిపారు.

రక్తదానంతో పలువురికి ప్రాణదానం: కలెక్టర్



వందేమాతరం గీతాన్ని ఆలపిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ప్రభుత్వ విప్ థామస్

గంగాధరనెల్లూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రక్తదానం చేయడం వల్ల పలువురికి ప్రాణదానం చేసిన వారమవుతామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి, జాతీయ క్యాన్సర్ అవగాహన దినం, వందేమాతరం గీతం రచించి 150 ఏళ్ల పూర్తయిన సందర్భాలను పురస్కరించుకుని గంగాధర నెల్లూరు పెద్దకాల్వ పంచాయతీ సుందరరాజుపురం వద్ద ఉన్న విజయం కాలేజీలో పలు కార్యక్రమాలు జరిగాయి. కలెక్టర్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్, విజయం విద్యాసంస్థల చైర్మన్ తేజోమూర్తి, లెక్చరర్లు, విద్యార్థులు, టీడీపీ నేతలు కలిసి వందేమాతరం గీతాన్ని ఆలపించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. సర్వీస్ ఎక్సలెన్సీ అవార్డును రాష్ట్ర గవర్నర్ ద్వారా విజయం విద్యాసంస్థలు పొందడం అభినందనీయమన్నారు. థామస్ మాట్లాడుతూ.. 32సార్లు మెగా రక్తదాన శిబిరాలు నిర్వహించిన తేజోమూర్తి, శైలజ దంపతులను ప్రశంసించారు. కళాశాలలో డిగ్రీ, ఎంబీఏ, ఇంజనీరింగ్ చదువుతున్న 240మంది విద్యార్థులు రక్తదానం చేశారు. జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ రమేష్‌బాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్ నాయుడు, పెనుమూరు ఏఎంసీ చైర్మన్ ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, సింగిల్‌విండో చైర్మన్ మోహన్‌నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు స్వామిదాస్, పార్లమెంట్ వాణిజ్యవిభాగం టీడీపీ అధికార ప్రతినిధి కామసాని కోదండరెడ్డి, విజయం ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ గోపి, ఏవో రాజగోపాలనాయుడు, బిజినెస్ స్కూల్, ప్రిన్సిపాళ్లు జయంత్, దేవేంద్రన్ పాల్గొన్నారు.

రెవెన్యూ క్రీడోత్సవాలు ప్రారంభం



చిత్తూరు-తిరుపతి మధ్య మహిళల టెన్నికాయిట్ పోటీలు

అనంతపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి):అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో ఏడవ రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడా,సాంస్కృతికోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల కలెక్టర్లు ఆనంద్, శ్యాంప్రసాద్, ఏపీ రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు ఇతర అధికారులతో కలిసి సీసీఎల్‌ఏ స్పెషల్ సీఎస్ జయలక్ష్మి క్రీడాజ్యోతిని వెలిగించి, పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమయపాలన, ఐక్యత, బాధ్యతకు క్రీడలు దోహదం చేస్తాయని తెలిపారు. వాలీబాల్ పోటీల్లో మొదటి రౌండ్‌లో తిరుపతిపై నంద్యాల, చిత్తూరుపై తూర్పుగోదావరి విజయం సాధించాయి.కబడ్డీలో తిరుపతిపై పార్వతీపురం, నంద్యాలపై చిత్తూరు జట్లు విజయం సాధించి రెండో రౌండ్‌కు అర్హత సాధించాయి. బ్యాడ్మింటన్ మహిళల డబుల్స్‌లో తూర్పుగోదావరిపై చిత్తూరు జట్టు గెలుపొందింది. టెన్నికాయిట్ మహిళల పోటీల్లో తిరుపతిపై చిత్తూరు జట్టు గెలుపొందింది. టేబుల్‌టెన్నిస్ మహిళల విభాగంలో చిత్తూరుపై కాకినాడ జట్టు గెలుపొందగా చెస్ పురుషుల విభాగంలో తిరుపతిపై విజయనగరం, మహిళల విభాగంలో తిరుపతిపై విజయనగరం, చిత్తూరుపై తూర్పుగోదావరి, జట్లు గెలుపొందాయి.

'వందేమాతరం'దేశభక్తిని మేల్కొలిపే

ఆత్మీయ నినాదం





జాతీయ జెండాతో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత - విద్యార్థులతో కలిసి వందేమాతరం గీతాన్ని ఆలపిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

చిత్తూరు అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వందేమాతరం కేవలం గీతం మాత్రమే కాదని.. అది ప్రజల మనస్సుల్లో దేశభక్తిని మేల్కొలిపే ఆత్మీయ నినాదమని ఏఎస్పీ రాజశేఖర్‌రాజు అన్నారు. వందేమాతరం గీతాన్ని రచించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం స్థానిక గాంధీ విగ్రహం వద్ద వెయ్యిమంది విద్యార్థులు, పోలీసులు, అధికారులు కలిసి ఆలపించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ.. వందేమాతరం గీతం స్ఫూర్తిని అర్థం చేసుకుని దేశసేవలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, మేయర్ అముద, డీఎస్పీ సాయినాథ్, ఏఆర్ డీఎస్పీ మహబూబ్ బాష, సీఐలు మహేశ్వర, నెట్టికంఠయ్య, తదితరులు పాల్గొన్నారు.

పంటలపై కొనసాగుతున్న గజదాడులు

● పంటల నష్టంతో కన్నీటి పర్యంతమవుతున్న అన్నదాత





ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరి పంట

కల్లూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల మంద దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. రాత్రుల్లో పొలాల్లో గజ రాజుల బీభత్సం సృష్టిస్తున్నాయి. దీంతో పొలాల్లో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. మండలంలోని దేవళంపేట పంచాయతీలో గురువారం రాత్రి వరి, మామిడిచెట్లను ఏనుగుల మంద ధ్వంసం చేయడంతో రైతులకు అపారనష్టం వాటిల్లింది. ముందుగా తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని సూరప్పచెరువు నుంచి బయలుదేరిన 16 ఏనుగుల మంద జెమిలిగుట్ట మార్గంలో పొలం వద్దకు చేరుకున్నాయి. అక్కడి గ్రామస్తులు టపాకాయలు పేల్చడంతో హంద్రీ-నీవా కాలువ మార్గంలో దేవళంపేట పంచాయతీ కుమ్మరిపల్లి, గెండేవారిపల్లి, మిట్టమీదరాచపల్లి గ్రామాల్లో పలు పంటలను ధ్వంసం చేసి అడవిలోకి చేరుకున్నాయి. ఏనుగుల మంద శుక్రవారం పగలంతా అడవిలోని సూరప్పచెరువు వద్ద తిష్ట వేసినట్లు ప్రజలు తెలిపారు. ఏనుగుల దాడుల్లో ధ్వంసమైన పంటలను శుక్రవారం ఎఫ్ఎస్‌వో మహమ్మద్ షఫి, ఎఫ్‌బీవోలు కృష్ణమూర్తి, మధు ట్రాకర్స్‌తో కలిసి పరిశీలించారు. బాధిత రైతులకు నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్ వన్ సైడ్ కావాలి

రాష్ట్ర ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్



పీఏసీఎస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపడుతున్న మాదిరాజు జనార్ధనరాజు



ఎమ్మెల్యే థామస్, జనార్ధనరాజును సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

వెదురుకుప్పం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్ వన్ సైడ్ కావాలని టీడీపీ శ్రేణులకు రాష్ట్ర ప్రభుత్వ విప్ డాక్టర్ వీఎం థామస్ పిలుపునిచ్చారు. ఇందుకు అవసరమైన సహకారం అందిస్తానని తాను అందిస్తానని తెలిపారు. శుక్రవారం కార్వేటినగరంలో పీఏసీఎస్ చైర్మన్ మాదిరాజు జనార్ధన్‌రాజు, డైరెక్టర్లు ఆర్.జయచంద్రన్, సి.చిన్నబ్బ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన థామస్ మాట్లాడుతూ.. వర్గపోరు సహించనని, నియోజకవర్గమంతా ఏకతాటిపై నడవాలన్నారు. త్వరలో కార్వేటినగరం మండలం అల్లాగుంట సమీపంలో రెండు వందల ఎకరాల్లో పరిశ్రమ స్థాపన ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రతి మండలంలో పరిశ్రమలను ఏర్పాటు చేసి.. నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేతృత్వంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు తీస్తున్నాయని స్పష్టం చేశారు. ఇది మంచి ప్రభుత్వమని.. కష్టపడే ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. టీడీపీ నేతలు మాదిరాజు మురళీకృష్ణ, మాదిరాజు విజయకుమార్, క్లస్టర్ ఇన్‌చార్జి పి.మోహన్‌మురళి, టీడీపీ మండల అధ్యక్షులు చెంగల్రాయయాదవ్ (కార్వేటినగరం), గంధమనేని జయశంకర్‌నాయుడు (ఎస్‌ఆర్‌పురం), పెద్దినేని రుద్రయ్యనాయుడు (పెనుమూరు), స్వామిదాస్(గంగాధరనెల్లూరు), పీఏసీఎస్ చైర్మన్ బోడిరెడ్డి సుధాకర్‌రెడ్డి(చవటగుంట), ఏఎంసీ చైర్మన్ కృష్ణమనాయుడు, అరుల్‌నాథన్, నాయకులు జిలేళ్ల లోకనాథనాయుడు, మేలపూడి రాజేంద్రరెడ్డి, సోమశేఖర్‌యాదవ్, సోమశేఖర్, రవియాదవ్, తోటి మురళీమోహన్, చంద్రగిరి చెంగల్రాయులు పాల్గొన్నారు.

మామిడి రైతులకు న్యాయం చేయండి



మంత్రి అచ్చెన్నాయుడితో మాట్లాడుతున్న రైతులు, నాయకులు

చిత్తూరు సెంట్రల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తమకు న్యాయం చేయాలని అమరావతిలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడిని జిల్లాలోని మామిడి రైతులు శుక్రవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. తోతాపురి కిలోకు ప్రభుత్వం నుంచి సబ్సిడీ కింద రూ.4 ఇచ్చారని, ఫ్యాక్టరీల నుంచి రూ.8 ఇప్పించాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో జిల్లా మామిడి రైతుల సంక్షేమ సంఘం నాయకులు ఆనందనాయుడు, హరిబాబు, సుకుమార్ నాయుడు, వెంకటేష్, రైతులు ఉన్నారు.

కుప్పంలోని 'నెర్వ్ సెంటర్'కు ప్రశంస



సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు సెంట్రల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కుప్పం పట్టణంలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన టాటా డిజిటల్ నెర్వ్ సెంటర్ ప్రశంసనీయమని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖలోని పోషకాహార, అనుబంధ ఆరోగ్య సేవల ఉప కమిషనర్ డాక్టర్ జోయా అలీ రిజ్వీ అన్నారు. శుక్రవారం కలెక్టర్ సుమిత్ కుమార్ అధ్యక్షతన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జాతీయ ఆరోగ్య మిషన్ కేంద్ర బృందం జిల్లాలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ వివిధ అంశాలపై జిల్లాలో క్షేత్ర స్థాయి పర్యటన ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ, ప్రైవేటు ఆధ్వర్యంలో జిల్లా వైద్య రంగంలో చేపట్టిన పలు విప్లవాత్మక మార్పులను కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కేంద్ర బృందానికి వివరించారు. కుప్పంలోని డిజిటల్ నెర్వ్ సెంటర్ మంచి ఫలితాలు సాధిస్తోందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ శ్రీహరి కృష్ణన్, కన్సల్టెంట్, ఎన్‌హెచ్‌ఎం ఫైనాన్స్ డాక్టర్ పార్థవి థాంపీ, రీసెర్చ్ కోఆర్డినేటర్ డాక్టర్ సీవీఎస్ రాయుడు, డీఎంహెచ్‌వో డాక్టర్ సుధారాణి, అడిషనల్ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్, ప్రోగ్రామింగ్ అధికారులు పాల్గొన్నారు.

పేరొకటి .. ఆధార్ మరొకటి!

● అధికారుల తప్పిదంతో అందని రేషన్‌కార్డు ● కార్యాలయాల ప్రదక్షిణలో బాధితురాలు సరస్వతి



శ్యామల పేరుతో లింక్ అయిన సరస్వతి ఆధార్ నంబర్- రేషన్ కార్డుకోసం అమినిగుంట సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటున్న సరస్వతి

చౌడేపల్లె, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమినిగుంట పంచాయతీ రామయ్యగట్టుకు చెందిన సరస్వతి (43)కి అదే గ్రామానికి చెందిన దొరస్వామితో 23 ఏళ్ల క్రితం వివాహమైంది. కొన్నేళ్లకు భర్త నుంచి విడిపోయి పరికిదొనకు చెందిన బండారి సుబ్రహ్మణంను వివాహం చేసుకుంది. సుబ్రహ్మణ్యం ఏడేళ్ల క్రితం మృతి చెందాడు. అయితే ఆమెకు అప్పటి నుంచి రేషన్ కార్డు లేదు. రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటే ఆమె ఆధార్‌పై ముందుగానే రేషన్ కార్డు ఉన్నట్లు గర్తించారు. శుక్రవారం అమినిగుంట సచివాలయంలో మరొక్కసారి రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేయగా సరస్వతి ఆధార్ నంబర్ పరికిదొనకు చెందిన బండారు శ్యామల పేరుతో ఉన్న రేషన్ కార్డులో సరస్వతి ఆధార్ నంబర్ ఉండటం గుర్తించారు. ఈ విషయంపై తహసీల్దార్ పార్వతిని వివరణ కోరగా తమ దృష్టికి రాలేదని, సోమవారం పరిశీలించి న్యాయం చేస్తామని తెలిపారు.

బ్యాంకుల్లో మీ డబ్బును క్లెయిమ్ చేసుకోండి: కలెక్టర్

చిత్తూరు సెంట్రల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పదేళ్లు.. అంతకుమించి లావాదేవీలు జరగని బ్యాంకు ఖాతాల్లోని మీ డబ్బును క్లెయిమ్ చేసుకోవాలని ప్రజలకు కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. ఇందుకు సంబంధించి వాల్‌పోస్టర్లను శుక్రవారం కలెక్టరేట్‌లో బ్యాంకు అధికారులతో కలిసి ఆవిష్కరించారు. మీ డబ్బు.. మీ హక్కు నినాదంతో భారత ప్రభుత్వం దేశవ్యాప్తంగా కార్యక్రమం చేపట్టిందన్నారు. జిల్లాలో టాప్ వెయ్యి వ్యక్తిగత ఖాతాల్లో క్లెయిమ్ చేయని డబ్బు రూ.28 కోట్లు ఉందని తెలిపారు. ఎల్‌డీఎం హరీష్, బ్యాంకు ప్రతినిధులు పాల్గొన్నారు.

సివిల్ పోలీసులకు ఫైరింగ్‌లో శిక్షణ



చిత్తూరు అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జీడీ నెల్లూరు సమీపంలో ఉన్న ఫైరింగ్ రేంజ్‌లో శుక్రవారం సివిల్ పోలీసులకు ఫైరింగ్ శిక్షణ ప్రారంభమైంది. ఈ సందర్భంగా సిబ్బందికి ఏఆర్ డీఎస్పీ మహబూబ్ బాష పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అందుబాటులోని సాంకేతికతను వినియోగించుకోవాలని చెప్పారు. అడ్మిన్ ఆర్ఐ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

వరసిద్ధుడి నిత్యాన్నదానానికి విరాళం



దాతకు జ్ఞాపికను అందిస్తున్న సూపరింటెండెంట్ వాసు

ఐరాల(కాణిపాకం), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాణిపాకంలో ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి కడప జిల్లా జమ్మలమడుగుకు చెందిన చేతన్‌కుమార్‌రెడ్డి ఆన్‌లైన్ ద్వారా రూ.1,00,016 చెల్లించారు. దాత కుటుంబ సమేతంగా శుక్రవారం కాణిపాకం విచ్చేశారు. దాతను సూపరింటెండెంట్ సూపరింటెండెంట్ వాసు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ


నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న యువకులు

కుప్పం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చలి విజృంభిస్తుండటంతో కుప్పం పట్టణంలో అనాథలైన గూడులేని పేదలకు కుప్పం సమాచారం సొసైటీ తరఫున యువకులు కొందరు శుక్రవారం దుప్పట్లు పంపిణీ చేశారు. రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండు తదితర ప్రాంతాలలో అనాథలు, యాచకులులకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు కుప్పం సమాచారం సొసైటీ సభ్యులు మతిన్, కలీం, గని, సురేశ్ తదితరులు తెలిపారు. సొసైటీకి చెందిన పలువురు సభ్యులు పాల్గొన్నారు.

ఆరోగ్య ప్రదాత దొరస్వామి నాయుడు


మాట్లాడుతున్న పీఈఎస్ ప్రిన్సిపాల్ హెచ్ఆర్ కృష్ణారావు తదితరులు

కుప్పం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్య ప్రదాత డాక్టర్ దొరస్వామినాయుడని పలువురు వైద్య ప్రముఖులు పేర్కొన్నారు. కుప్పం పీఈఎస్ వైద్య కళాశాలలో శుక్రవారం పీఈఎస్ విద్యా సంస్థల వ్యవస్థాక చైర్మన్ డాక్టర్ ఎంఆర్.దొరస్వామి నాయుడు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆస్పత్రిలోని రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. అన్నదానం నిర్వహించారు. ఆస్పత్రి సిబ్బంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో పీఈఎస్ వైద్య కళాశాల డీన్ అండ్ ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్ఆర్.కృష్ణారావు, ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంటు డాక్టర్ ఎన్‌కే.సుబ్రహ్మణ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ర్యాలీ సుబ్బారావు, అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మోహన్ రూప, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ కిరణ్, హెచ్ఆర్ మేనేజరు రాజ్ కుమార్, అడ్మిన్ ఎగ్జిక్యూటివ్ అభిలాష్, ఆస్పత్రి సిబ్బంది, వైద్య విభాగాధిపతులు, వైద్యులు, వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం


హౌసింగ్ మంజూరు పత్రాలు పంపిణీ చేస్తున్న కంచర్ల, పీఎస్ఎం తదితరులు

కుప్పం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు పేదవారి సొంతంటి కల సాకారం చేశారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, కేపీయం ఉడా చైర్మన్ డాక్టర్ సురేశ్‌బాబులు అన్నారు. కుప్పం పురపాలక సంఘ కార్యాలలయంలో శుక్రవారం మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్ అధ్యక్షతన 509 మంది లబ్ధిదారులకు ఎన్టీఆర్ గృహ పథకం కింద పక్కా గృహాల మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రతి లబ్ధిదారుడికీ రూ.2.50 లక్షల వంతున రాష్ట్ర ప్రభుత్వం మొత్తం రూ.12.72 కోట్లు పక్కా గృహాల నిర్మాణం కోసం మంజూరు చేసిందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు, కడా రాజకీయ సలహా మండలి సభ్యుడు రాజ్‌కుమార్, కౌన్సిలర్లు, బీజేపీ నియోకవర్గ ఇన్‌చార్జి తులసీనాథ్, పలువురు ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబాల అవసరాలు సేకరించాలి


శిబిరంలో నేతలు, మెగా ఇంజనీరింగ్ సంస్థ ప్రతినిధులు

రామకుప్పం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బంగారు కుటుంబాల అవసరాలను పకడ్బందీగా సేకరించాలని టీడీపీ రామకుప్పం మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షులు వెంకటరమణ, ఆనందరెడ్డి కోరారు. శుక్రవారం రామకుప్పం మండల సచివాలయంలో పీ-4 సీఆర్పీల అవగాహన శిబిరంలో వారు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పీ-4 కార్యక్రమంలో భాగంగా రామకుప్పం మండలాన్ని దత్తత తీసుకున్నారని, పేద కుటుంబాలకు మేలు కలిగేలా సీఆర్పీలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పీ-4 కార్యక్రమ నిర్వహణ ప్రతినిధులు వినాయకరెడ్డి, జిలానీ, శివకృష్ణ, ధనుంజయరెడ్డి పాల్గొన్నారు.

10 లోపు మద్యంషాపునకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోండి

పుంగనూరు రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పెద్దపంజాణి మండల పరిధిలోని గీత కులస్థులు మద్యం షాపు కోసం ఈనెల 10వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పుంగనూరు ఎక్సైజ్ సీఐ సురేశ్‌రెడ్డి కోరారు. ఈనెల 12న ఉదయం 8 గంటలకు చిత్తూరు కలెక్టర్ కార్యాలయం వద్ద లాటరీ పద్ధతిలో ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. అలాగే పుంగనూరు ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈనెల 10వ తేదీన బహిరంగ వేలం వేయనున్నట్లు చెప్పారు. వేలంలో పాల్గొనే వారు ఆధార్‌కార్డుతో పాటు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

రెజ్లింగ్‌లో సోమల విద్యార్థినికి గోల్డ్ మెడల్

సోమల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ బాలికల అండర్ - 17 పోటీల్లో సోమల హైస్కూల్ విద్యార్థిని బి. హేమనిధి గోల్డ్ మెడల్ సాధించినట్లు హెచ్ఎం. హేమసుధాకర్ తెలిపారు. విద్యార్థిని విశేష ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించడంతో పీడీ కరుణానిధి, ఉపాధ్యాయులు అభినందించారు.


విద్యార్థిని హేమనిధి

పాఠశాలకు రెండు బీరువాల వితరణ


హెచ్ఎం సుబ్రహ్మణ్యంకు బీరువాలు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

సదుం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సదుం జడ్పీ ఉన్నత పాఠశాలలో 1988-89 విద్యా సంవత్సరంలో చదువుకున్న విద్యార్థులు శుక్రవారం పాఠశాలలోని గ్రంథాలయానికి రెండు బీరువాలను శుక్రవారం వితరణగా అందించారు. అలాగే పూర్వ విద్యార్థి, లెఫ్టినెంట్ కల్నల్ ఉదయ్ కుమార్ తన తండ్రి ఆకుల మునస్వామి నాయుడు జ్ఞాపకార్థం పాఠశాలకు మరో రెండు బీరువాలను అందజేశారు. హెచ్ఎం సుబ్రహ్మణ్యం, పూర్వ విద్యార్థులు ప్రసాద్, కళ్యాణ్ రెడ్డి, వెంకటరమణ, డా.ఆశాది వెంకటరమణ, వాసుదేవ రెడ్డి, జమీల్, మునిశేఖర రెడ్డి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

కుప్పం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కుప్పం 132 కేవీ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 6 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు కుప్పం పట్టణం, రూరల్, గుడుపల్లె మండలాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని కుప్పం రెస్కో ఎండీ సోమశేఖర్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

డిసెంబర్ 13న జాతీయ లోక్‌అదాలత్


సీనియర్ సివిల్ జడ్జి ఆరీఫా

పుంగనూరు రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 13న పుంగనూరు కోర్టు ఆవరణలో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ఆరీఫా కోరారు. శనివారం ఆమె మాట్లాడుతూ రాజీకి అనువైన సివిల్, క్రిమినల్ కేసులను రాజీ చేయడానికి పోలీసులు, న్యాయవాదులు సహకరించాలని తెలిపారు. లోక్‌అదాలత్‌లో కేసులను పరిష్కరించుకోవడంతో సమయం, డబ్బు ఆదా అవుతుందని వివరించారు.

ప్రతిఒక్కరికీ రక్త పరీక్షలు


కెంచనబల్లలో రక్తపరీక్ష శిబిరాన్ని ప్రారంభిస్తున్న నేతలు

రామకుప్పం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతులుగా జీవించాలన్నదే సీఎం చంద్రబాబు ధ్యేయమని.. ఇందుకోసం ఉచితంగా ప్రతిఒక్కరికీ రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారని టీడీపీ బీసీసెల్ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణచారి తెలిపారు. శుక్రవారం రామకుప్పం మండలం కెంచనబల్లలో ఉచిత రక్తపరీక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో విజలాపురం ప్రభుత్వాస్పత్రి హెల్త్ అసిస్టెంట్ బాలు, టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ సత్తి, నేతలు రామాంజులు, గుణశేఖర్, విజయ్, మతీన్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి నిరంతర కృషి


యూరియా పంపిణీ చేస్తున్న నేతలు

రామకుప్పం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందని రెస్కో డైరెక్టరు మనోహర్, ఏఎంసీ డైరెక్టరు పవన్‌కుమార్ తెలిపారు. శుక్రవారం రామకుప్పం మండలం సింగసముద్రం, 89పెద్దూరు గ్రామసచివాలయాల్లో రైతులకు యూరియా పంపిణీ చేశారు. రైతులకు ఏ ఆపద వచ్చినా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వారిని ఆదుకుంటోందన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్లు అముద, ప్రత్యూష, టీడీపీ యూనిట్ ఇన్‌చార్జీలు గజేంద్ర, కృష్ణప్ప, 89పెద్దూరు, సింగసముద్రం పంచాయతీల పార్టీ అధ్యక్షులు లోకేశ్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


మొక్కలు నాటుతున్న నేతలు

రామకుప్పం, నవంబరు 7 (ఆంధ్ర జ్యోతి): మానవాళి మనుగడ సాఫీగా సాగాలంటే పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్వీకరించాలని టీడీపీ రామకుప్పం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటరమణ, నరసింహులు కోరారు. శుక్రవారం రామకుప్పం బాలుర ఉన్నత పాఠశాలలో వారు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. వృక్ష సంపద పెరిగితేనే పర్యావరణ సమతుల్యత ఏర్పడి, జనం రుగ్మతల నుంచి దూరమవుతారన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు తమ ఇంటి ఆవరణలో తప్పక మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని కోరారు. ప్రధానోపాధ్యాయుడు ధనుంజయులు, ఎస్ఎంసీ చైర్మన్ శ్రీరాములు, నేతలు మురళీధర్, ఆదిల్, సుబ్రహ్మణ్యం, బాలకృష్ణ పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎస్ఐ నాగేశ్వరరావు

చౌడేపల్లె, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎస్ఐ నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా స్థానిక జూనియర్ కళాశాల విద్యార్థులకు నిర్వహించిన 3కే రన్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అలాగే వందేమాతరం గీతం రచించి 150 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా విద్యార్థులకు వందేమాతరం గీతం విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐ మణికంఠేశ్వరరెడ్డి, ప్రిన్స్‌పాల్ జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య పోరాటంలో వందేమాతరం ఓ ఆయుధం



పలమనేరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): భారత స్వాతంత్ర్య పోరాటంలో వందే మాతరం గీతం ఓ ఆయుధంలా పనిచేసిందని పలమనేరు పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు రత్నారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పలమనేరులో పెన్షనర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్లకు రావాల్సిన బకాయిలు, డీఏలకు సంబంధించిన జీవోలను సభ్యులకు వివరించారు. సీనియర్ సభ్యులు సుబ్రహ్మణ్యంపిళ్లై మాజీ కార్యదర్శి దొరస్వామి, సభ్యులు నాగభూషణం, ట్రెజరర్ దవణముని, సిద్దమనోహర్, విజయకుమార్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, గోవిందరాజులు, పొన్ముడి, సూర్యనారాయణరెడ్డి, జగన్నాథం, పాపయ్య, వెంకటేశ్వర్లు, శ్యామరాజు, మొగిలయ్య రులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్


యువతతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్ఎం తదితరులు

కుప్పం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేస్తున్నారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేశ్‌బాబు, కడా పీడీ వికాస్ మర్మత్ అన్నారు. కుప్పం ద్రావిడ విశ్వవిద్యాలయంలో శుక్రవారం 1ఎం 1 బి గ్రీన్ సిగ్నల్ అకాడమీ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ యువత ఉపాధి, ఉద్యోగ అవకాశాలతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. ఇందుకోసం వేల, లక్షల కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టి పరిశ్రమలు స్థాపించడానికి రాష్ట్రంలో అనేక కంపెనీలు ముందుకొస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ మంత్రి నారా లోకేశ్‌ల సంకల్పంతో ఎందరో దేశ, విదేశ పెట్టుబడిదారులు పరిశ్రమల స్థాపన కోసం రాష్ట్రానికి వలస వస్తున్నారన్నారు. మరో కోణంలో ఆయా కంపెనీలలో యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనకోసం రాష్ట్ర వ్యాప్తంగా జాబ్ మేళాలు నిర్వహిస్తున్నామన్నారు. కుప్పంలోని నిరుద్యోగ యువత ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకుని ఉద్యోగావకాశాలు సొంతం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇటువంటి జాబ్ మేళాలు నిరంతరం కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలు కంపెనీల ప్రతినిధులు యువతకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. అర్హులైన వారికి ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు.

కోట్లాది ప్రజల గుండె చప్పుడు వందేమాతర గీతం


సోమల బస్టాండ్‌లో వందేమాతరం గీతాలాపన


పుంగనూరు: వందేమాతరం గీతాలాపనలో పాల్గొన్న సీఐ సుబ్బరాయుడు


బొమ్మయ్యగారిపల్లెలో బకించంద్ర చిత్ర పటానికి చల్లాబాబు పూజలు

కల్లూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కోట్లాది ప్రజల గుండెచప్పుడు వందేమాతర గీతమని ఎంపీడీవో రాజశేఖర్, ఎంఈవో పోకల తాతయ్య తెలిపారు. వందేమాతం గీతం రచించి 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పులిచెర్ల మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం సామూహిక వందేమాతర గీతాన్ని ఆలపించారు. విద్యార్థులు ఆలపించిన వందేమాతర గీతం అందరినీ ఆకట్టుకుంది. అధికారులు, పాఠశాల హెచ్ఎంలు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● **సదుం:** మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, కార్యాలయాలలో వందేమాతరం గీతాలాపన ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రాధా రాణి, మండల పరిషత్, రెవెన్యూ కార్యాలయ అధికారులు, సిబ్బంది ఆలపించారు.

● **పుంగనూరు:** స్థానిక జడ్పీ హైస్కూల్ ఆవరణలో వందేమాతరం 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బీజేపీ నాయకులు, విద్యార్థులు, పోలీసులు సామూహికంగా దేశభక్తిని చాటేలా వందేమాతరం గేయాన్ని ఆలపించారు. సీఐ సుబ్బరాయుడు, ఎస్ఐ హరిప్రసాద్, ఎంఈవో నటరాజరెడ్డి, ప్రిన్సిపాల్ విశ్వనాథనాయుడు, బీజేపీ నాయకులు ప్రసాద్, వెంకటరెడ్డి, నాగరాజ, ఉమాశంకర్, రమేష్ పాల్గొన్నారు.

● **సోమల:** యువత దేశాభివృద్ధికి తమ వంతు సాయం చేయాలని సోమల ఎస్ఐ శివశంకర పేర్కొన్నారు. శుక్రవారం విద్యార్థులు, పోలీసులు ర్యాలీ చేపట్టారు. వందేమాతరం గేయాన్ని స్థానిక ప్రజలు, విద్యార్థులతో కలిసి ఆలపించారు.

● **రొంపిచెర్ల:** రొంపిచెర్లలో ఎంఈవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల ల విద్యార్థులు రొంపిచెర్ల బస్టాండ్ కూడలిలో సామూహిక వందేమాతరం గీతాలాపన చేశారు. ప్రధానోపాధ్యాయులు ధనలక్ష్మి, అమరశేఖర్, ఎస్ఐ సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు నాగరాజ, రఘునాథ్, సహదేవ, ఈశ్వరయ్య, పంచాయతీ కార్యదర్శి హరిబాబు,ఉపాధ్యాయులు అమరనాయక్, రహీబాషా, నాగరాజ, గంగాధరం పాల్గొన్నారు.

ఎన్నికల్లో మెజారిటీ సాధనకు కృషి చేయాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

రామకుప్పం/శాంతిపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎక్కడా లేని విధంగా అభివృద్ధి చేస్తున్నారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. శుక్రవారం శాంతిపురం మండలం ఎంకేపురం పంచాయతీ టీడీపీ శ్రేణుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వంద కోట్ల వ్యయంతో హంద్రీ-నీవా కాలువ ద్వారా కృష్ణాజలాలను తీసుకొచ్చి నియోజకవర్గంలో సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపారన్నారు. శాంతిపురం, రామకుప్పం మండలాల మధ్య ఎయిర్‌పోర్టు, వందలాది ఎకరాల్లో పరిశ్రమల ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకుంటున్నారన్నారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో వందకు వంద శాతం స్థానాల్లో కూటమి అభ్యర్థులు బారీ మెజారిటీలతో ఘనవిజయం సాధిచేందుకు పార్టీ శ్రేణుల ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, పీకేఎం ఉడా చైర్మన్ డా.సురేష్‌బాబు, టీటీడీ సభ్యులు శాంతారాం, టీడీపీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు నందిగంఉదయ్‌కుమార్, మంజునాథ్, విశ్వనాథనాయుడు, విండో చైర్మన్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గడ్డంవారిపల్లె రోడ్డులో పారిశుధ్య చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



చౌడేపల్లె, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు గడ్డంవారిపల్లెలో దోమల నివారణకు పంచాయతీ అధికారులు మొలాథీన్ శుక్రవారం పిచికారీ చేశారు. అక్టోబర్ 29న ఆంధ్రజ్యోతిలో చౌడేపల్లెలో ఈగలతో ఇక్కట్లు శీర్షికన వార్తా కథనం ప్రచురితం కావడంతో ఎంపీడీవో లీలామాధవి, ఈవోఆర్డీ కృష్ణవేణి స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి శివకు సూచించారు. దీంతో శుక్రవారం దోమల నియంత్రణకు మొలాథీన్ మందును పిచికారీ చేయించారు.

ఖాతాదారుల శ్రేయస్సే ప్రథమ లక్ష్యం


బంగారు రుణాల కౌంటర్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

కల్లూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఖాతాదారుల శ్రేయస్సే ప్రథమ లక్ష్యమని విండో చైర్మన్ ధనంజయనాయుడు, డీసీసీ బ్యాంకు మేనేజర్ సులోచన, విండో సీఈవో సుబ్రహ్మణ్యం తెలిపారు. పులిచెర్ల సింగిల్ విండో కార్యాలయంలో శుక్రవారం బంగారు రుణాల కౌంటర్‌ను నూతనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంగారంపై తక్కువ వడ్డీకే రుణ సౌకర్యం ఉంటుందన్నారు. ఈ సౌకర్యాన్ని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టీడీపీ నాయకులు కుమారరెడ్డి, రమేష్, గురప్ప, జయకుమార్, ప్రభాకర్, నాగరాజు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలతో క్యాన్సర్ బారిన పడొద్దు


చౌడేపల్లెలో వైద్యసిబ్బంది, విద్యార్థుల మానవహారం

పలమనేరు, రామకుప్పం, సోమల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాలకు బానిసలై క్యాన్సర్ బారిన పడొద్దని రామకుప్పం ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి లోకేశ్ కోరారు. జాతీయ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించకుని శుక్రవారం వైద్య సిబ్బంది, విద్యార్థులు రామకుప్పంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ● సోమల మండలంలోని సోమల, కందూరు, పెద్దఉప్పరపల్లె పీహెచ్‌సీల పరిధిలో అవగాహన ర్యాలీలు నిర్వహించారు.● పలమనేరులోని అర్బన్ యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో కాకాతోపు, బజారువీధి, సచివాలయాల పరిధిలో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ● చౌడేపల్లెలో డాక్టర్ మోనా ఆధ్వర్యంలో జాతీయ క్యాన్సర్ అవగాహన దినం సందర్భంగా శుక్రవారం స్థానిక హైస్కూల్ విద్యార్థులు, వైద్యసిబ్బంది కలిసి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. బస్టాండులో మానవహారం నిర్వహించి అవగామన కల్పించారు. ఏఎన్ఎంలు, హెచ్ఎం ఈశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు, ఆశ కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

●పుంగనూరు: క్యాన్సర్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు పుంగనూరు వైద్యాధికారిణి డాక్టర్ కిరణ్మయి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని కొత్తపేట, రాగానిపల్లె మార్గంలోని ప్రజలకు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మద్యం, పొగ తాగడంతో క్యాన్సర్ వ్యాధి వ్యాప్తి చెందుతుందన్నారు.

చట్టం దృష్టిలో అందరూ సమానులే

● న్యాయమూర్తి వరుణ్‌తేజ్


సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి వరుణ్‌తేజ్

రామకుప్పం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చట్టం దృష్టిలో పేద, ధనిక తేడా ఉండదని, అందరూ సమానులే అని కుప్పం అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వరుణ్ తేజ్ తెలిపారు. జాతీయ న్యాయసేవల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం రామకుప్పం మండలం విజలాపురం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ న్యాయం పొందడం అనేది సంపన్నుల హక్కు మాత్రమే కాదని అణగారిన, పేద వర్గాల హక్కు అని తెలిపారు. పోక్సోచట్టంతోపాటు ఇతర చట్టాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కుప్పం పారా లీగల్ వలంటీర్లు మహేష్, సెల్వం, కోర్టు సిబ్బంది రాజా, హరీ, విద్యాలయం ఉపాధ్యాయులు స్వాతి, లలిత పాల్గొన్నారు.

మహిళలపై దౌర్జన్యం

-పోలీసులకు ఫిర్యాదు చేస్తే బాధిత మహిళల కుటుంబ సభ్యులపైనే కేసు

పలమనేరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మరొకరి అనుభవంలో వున్న భూమిలో ప్రవేశించడమే కాక ట్రాక్టరుతో దున్నేందుకు ప్రయత్నించి అడ్డుకున్న మహిళలపై దౌర్జన్యం కూడా చేసిన ఉదంతమిది. పోలీసులకు బాధిత మహిళలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు....బైరెడ్డిపల్లె మండలం టీఎన్‌కుప్పం గ్రామానికి చెందిన ఓబిరెడ్డి వారసుల అనుభవంలో ఉన్న భూముల్లోకి ఈ నెల 3వతేది విజయభాస్కరరెడ్డి ప్రవేశించడమే కాక ట్రాక్టరుతో దున్నేందుకు ప్రయత్నించాడు.ఈ విషయం తెలుసుకున్న ఓబిరెడ్డి కుటుంబ మహిళలు ట్రాక్టరును అడ్డుకొన్నారు. దీంతో విజయభాస్కరెడ్డి వారిని కిందకు తోసి దుర్భాషలాడాడు. ట్రాక్టరుతో తొక్కించి చంపేస్తానని బెదిరించాడు.ఈ విషయం తెలుసుకొన్న మహిళల భర్తలు సంఘటనా స్థలానికి వచ్చి విజయభాస్కరరెడ్డిని పొలం నుంచి వెలుపలకు పంపేశారు.తరువాత పోలీసులు తహసిల్దార్ వద్దకు రావాలని ఓబిరెడ్డి వారసులకు సూచించారు. వారు తహసిల్దార్ వద్దకు వెళ్లి విజయభాస్కరరెడ్డి, అతని కుమారులు తమపై దౌర్జన్యం చేశారని చెబుతుండగా అక్కడే వున్న విజయభాస్కరరెడ్డి కుమారులు ఏం పీక్కొంటారంటూ దుర్భాషలాడారు.అక్కడే వున్న బైరెడ్డిపల్లె ఎస్ఐ , హెడ్‌కానిస్టేబుల్, ఇద్దరు పోలీసులు వారిని వారించకపోవడంతో బాధిత మహిళలు నేరుగా జరిగిన విషయాన్ని బైరెడ్డిపల్లె పోలీసులకు అదేరోజు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.ఆ ఫిర్యాదును బుట్టదాఖలు చేసిన పోలీసులు రెండు రోజుల తరువాత దౌర్జన్యంచేసిన వారినుంచే ఫిర్యాదు తీసుకొని బాధిత మహిళల భర్తలపై, కుటుంబసభ్యులపై కేసునమోదు చేశారు.జరిగిన సంఘటనలపై జిల్లా అధికారులకు ఫిర్యాదు పంపుతున్నట్లు బాధిత మహిళలు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్

రొంపిచెర్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. రొంపిచెర్లలోని ఆయన నివాసంలో శుక్రవారం నియోజకవర్గంలోని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యాల రమణ నాయకులు భాను నాయుడు, మునిరాజనాయుడు, గుణ, ప్రకాష్, నౌషాద్‌బాషా, కలీల్‌ఉల్లా, మౌలాలి, పఠాన్‌నౌషాద్, అల్లాబక్షు, రెడ్డిశేఖర్‌నాయుడు, వెంకటమునినాయుడు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

నల్లపువానిగుంట గండి మరమ్మతులు


నల్లపువానిగుంటకు చేపడుతున్న మరమ్మతు పనులు

సోమల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సోమల పంచాయతీ నల్లపువానికుంటకు గండి పడటంతో శుక్రవారం అధికారులు, ప్రజాప్రతినిధులు మరమ్మతులు చేపట్టారు. మట్టిని తరలించి పనులను పూర్తి చేశారు. నల్లపువానికుంట దిగువభాగంలో గండి పడటంతో ఆయకట్టు దారుల ఫిర్యాదు మేరకు ఎంపీడీవో ప్రసాద్, సింగిల్ విండో అధ్యక్షుడు శివశంకర్ గుంటను సందర్శించి పనులను ముమ్మరం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో లక్ష్మీదేవి, వీఆర్వోలు సురేశ్‌బాబు, లోకనాథం, టీడీపీ నాయకులు చాణుక్య, భానుప్రకాశ్ నాయుడు, రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం: ఎమ్మెల్యే భానుప్రకాష్



అర్జీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నానని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తెలిపారు. నగరి టీడీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో బాధితుల నుంచి అర్జీలను స్వీకరించారు. కూటమి ప్రభుత్వం ప్రతి సమస్యనూ పరిష్కరిస్తుందని స్పష్టం చేశారు. నగరి నియోజకవర్గంలోని ప్రజలకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యలను తక్షణం పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హైవే భూ బాధితులతో ఆర్డీవో సమావేశం


బాధితులతో చర్చిస్తున్న ఆర్డీవో అనుపమ

నగరి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు-తిరువళ్లూరు జాతీయ హైవేతో నష్టపోయిన భూ బాధితులతో శుక్రవారం నగరిలోని తన కార్యాలయంలో ఆర్డీవో అనుపమ సమావేశం నిర్వహించారు. వీకేఆర్‌పురం వద్ద ఓం శక్తి ఆలయం మంచినీటిగుంట, నెత్తంకండ్రిగ వద్ద ఉన్నత పాఠశాల, వీకేఆర్‌పురం ప్రాథమిక పాఠశాల, దేశమ్మ దేవస్థానం చర్చిలకు సంబంధించినవారితో మాట్లాడారు. తహసీల్దార్ రవికుమార్, సర్వేయర్ సురేష్‌తోనూ చర్చించారు. హైవే చట్టం ప్రకారం నష్ట పరిహారం చెల్లించడం జరుగుతుందని తీర్మానించారు. దేశమ్మ గుడి చైర్మన్ కృష్ణారెడ్డి, ఈవో వెంకటేశ్వరులు, కమిటీసభ్యుడు మదన్, కృష్ణమూర్తి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కళియంబాకం పెద్ద చెరువుకు తప్పిన ముప్పు


ఎక్స్‌కవేటర్‌తో పూడిక తొలగిస్తున్న అధికారులు

విజయపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కళియంబాకం పెద్ద చెరువుకు గండి పడే ముప్పు తప్పింది. చెరువులో మొరవ పారడానికి వరవ కాలువ చిత్తూరు - తచ్చూరు హైవే పనుల చేసేటప్పుడు పూడిపోయింది. రైతులు కూడా వదిలేయడంతో చెరువు కట్ట వైపు మొరవ నీరు మళ్లింది. ఈ నీటి ఉధృతితో చెరువు కట్ట మట్టి క్రమంగా కరిగిపోవడాన్ని గమనించిన గ్రామస్థులు అధికారులకు సమాచారం అందించారు. స్పందించిన తహసీల్దార్ కిరణ్, ఇరిగేషన్ ఏఈ ప్రశాంత్, ఎస్ఐ మహేష్‌బాబు, వీఆర్వో మేఘనాథం, సర్వేయర్ అఖిల సంఘటనా స్థలం చేరుకున్నారు. ఎక్స్‌కవేటర్ సాయంతో పూడికను తొలగించి, మొరవనీరు ప్రవాహాన్ని మళ్లించడంతో చెరువుకు గండి పడే ప్రమాదం తప్పిందని రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

మందులు స్టాకు లేవంటున్న ఏఎన్ఎంలు

- గంగాధరనెల్లూరు మండల మీట్‌లో సభ్యుల ధ్వజం



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీపీ అబ్బూ అనిత

గంగాధరనెల్లూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏఎన్ఎంలను ఎప్పుడు అడిగినా మందులు స్టాకు లేవంటున్నారని సభ్యులు ధ్వజమెత్తారు. గంగాధరనెల్లూరు ఎంపీడీవో ఆఫీస్ మీటింగ్ హాలులో శుక్రవారం ఎంపీపీ అబ్బూ అనిత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఎంపీపీతోపాటు మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఏకాంబరం, బుక్కాపట్నం, కలిజవేడు, వెజ్జుపల్లె సర్పంచ్‌లు మునిరాజారెడ్డి, నీలావతి, హరిప్రసాద్‌రెడ్డి ఈఅంశాన్ని ప్రస్తావించారు. సీహెచ్‌వో కృష్ణయ్య మాట్లాడుతూ మందులు సరఫరా తక్కువగా ఉండటమే దీనికి కారణమని, డీఎంహెచ్‌వోకి సమస్యను తెలియజేస్తామన్నారు. వేపంజేరి ఎంపీటీసీ రామచంద్రారెడ్డి, వెజ్జుపల్లె సర్పంచ్ హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ చెరువులను కొందరు ఆక్రమించుకుంటున్నారని చర్యలు తీసుకోవాలని కోరారు. పాపిరెడ్డిపల్లె ఎంపీటీసీ భారతి, సర్పంచ్ పార్థసారథి రెడ్డి మాట్లాడుతూ.. తమ పంచాయతీల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చినా పట్టించుకోనప్పుడు ఈ సమావేశాలెందుకని ప్రశ్నించారు. ఎంపీడీవో మనోహర్‌గౌడ్, తహసీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. మండలానికి తాము కొత్తగా వచ్చామని, సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. అనంతరం సమావేశానికి రాని అధికారులపై కలెక్టర్‌కు నివేదిక పంపించాలని పలువురు సభ్యులు డిమాండ్ చేశారు. వైస్ ఎంపీపీలు హరిబాబు, బేబి, సింగిల్‌విండో సొసైటీ చైర్మన్ మోహన్‌నాయుడు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పలుశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాల్లో తనిఖీలు

పాలసముద్రం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరుమలరాజుపురం, నరసింహాపురం సచివాలయాలను శుక్రవారం ఎంపీడీవో సతీష్ తనిఖీ చేశారు. డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ, పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

గుంతలమయమైన రోడ్లతో వాహనదారుల ఇక్కట్లు


అయ్యప్పరాజుకండ్రిగ వద్ద రోడ్డుపై గుంతలు - నొచ్చిలి రోడ్డు ఇలా..

పాలసముద్రం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గుంతలమయమైన రోడ్లతో వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. గంగాధరనెల్లూరు -బలిజకండ్రిగ రోడ్డు అత్తిమంజేరిపేట వనదుర్గాపురం రోడ్డు, అయ్యప్పరాజు కండ్రిగ వద్ద, నొచ్చిలి రోడ్డు, వెంగళరాజు కుప్పం నుంచి వీర్లగుడి కాలనీ రోడ్డు అధ్వానంగా ఉన్నాయి. గంగాధరనెల్లూరు-బలిజకండ్రిగ మార్గంలో ప్యాచ్ వర్కులను అరకొరగా నిర్వహించారు. ఈ క్రమంలో మొంథా తుఫాన్ కారణంగా రోడ్లన్నీ గుంతలమయంగా తయారయ్యాయి. ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పిపడి గాయాల పాలౌతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు తగిన చర్యలు తీసుకుని రోడ్లకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు, రేపు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం

చిత్తూరు రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఆపరేషన్ పరిధిలోని 220 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శని, ఆదివారాల్లో నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడనుందని ఈఈ మునిచంద్ర పేర్కొన్నారు. చిత్తూరు టౌన్ పరిధిలోని గిరింపేట, మిట్టూరు, సంతపేట, ఐటీఐ సెక్షన్ల పరిధిలో శనివారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. యాదమరి మండలంలోని మొర్దానపల్లె, ముత్తరపల్లె పరిసర ప్రాంతాల్లో శని, ఆదివారాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

అధ్వానంగా చవటపల్లె రోడ్డు

ఇబ్బంది పడుతున్న పాదచారులు, వాహనదారులు

చిత్తూరు సిటీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సంతపేట నుంచి మురకంబట్టుకు బైపాస్ రోడ్డుకు వెళ్లే మార్గంలోని చవటపల్లె గుంతలమయమై అధ్వానంగా ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వర్షపునీరు ఈ రోడ్డుపై నిలబడటంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సుమారు మూడు కిలోమీటర్లు ఉండే ఈ మార్గంలో విద్యార్థులు, ఉద్యోగులు, దినసరి కూలీలు రాకపోకలు సాగిస్తుంటారు. మరోవైపు ఇక్కడ వీధి దీపాలు కూడా లేవు. ఇప్పటికైనా


ఇక్కడ నూతనరోడ్డును నిర్మించి, వీధి దీపాలను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


గుంతలమయమైన రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

హామీలన్నీ నెరవేరుస్తున్న ప్రభుత్వం : ఎమ్మెల్యే జగన్మోహన్

గుడిపాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా ఇచ్చిన హామీలన్నీ రాష్ట్ర ప్రభుత్వం నెరవేరుస్తోందని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. శుక్రవారం వెంగమాంబాపురం, గట్రాల్లమిట్ట గ్రామ పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణాలకు భూమిపూజ చేశారు. బొమ్మసముద్రం - అడివిచేసుకు నూతన బస్సు సర్వీసును ప్రారంభించారు. ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో బాధితుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండలంలో రెవెన్యూ సమస్యలు అధికంగా ఉన్నాయని.. త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో వందేమాతరం గీతాన్ని ఆలపించారు. అండర్-17 స్కూల్ గేమ్స్ కుస్తీలో రాష్ట్ర స్థాయిలో బంగారు పతకం సాధించిన నరహరిపేట జడ్పీ హైస్కూల్ విద్యార్థి మహాలక్ష్మిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, మేయర్ అముద, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, ఎంపీడీవో శిరీష, తహసీల్దార్ శ్రీనివాసులు, ఏఈ ప్రసాద్ నాయుడు, సింగిల్‌విండో అధ్యక్షుడు ప్రతాప్‌నాయుడు, టీడీపీ నాయకులు బాలాజీనాయుడు, హేమాద్రినాయుడు, అనిల్‌కుమార్, పీటర్, మురళీనాయుడు, ధనసింగ్, చంద్రమోహన్, నాగరాజ్‌యాదవ్, బాలసుబ్రహ్మణ్యం యాదవ్, చల్లా, హరిప్రసాద్, శరత్, సుమతి, ఉదయ, శిల్ప పాల్గొన్నారు.


వెంగమాంబాపురంలో పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

కుంభాభిషేక పూజల్లో థామస్



శ్రీరంగరాజపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మెదవాడ పంచాయతీ మర్రిపల్లెలోని రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణ భజన మందిరం కుంభాభిషేకం, నాగదేవత విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ థామస్ శుక్రవారం హాజరయ్యారు. టీడీపీ నాయకులు గంధమనేని జయశంకర్ నాయుడు, కృష్ణయ్య నాయుడు, గంధమనేని రాజశేఖర్ నాయుడు, రుద్రయ్య నాయుడు, ఎన్.కుమార్, నీరంజన్‌రెడ్డి, పూజరి నాగరాజు, దశరథ, పుల్లూరు బాబు, జలంధర్ నాయుడు, రవి, వెంకటాచాలం, మాధవ నాయుడు, బీజేపీ నేత రాజేంద్రన్, జ్యోతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించడమే లక్ష్యం

వెదురుకుప్పం: ప్రజా సమస్యలను పరిష్కరించడమే లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్ వీఎం థామస్ తెలిపారు. శుక్రవారం కార్వేటినగరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితుల నుంచి అర్జీలను స్వీకరించారు. తన దృష్టికి వచ్చిన సమస్యలకు నిర్ణీత కాలంలో పరిష్కారం చూపిస్తామన్నారు. తహసీల్దార్ నాగరాజు, ఆర్ఐ నరసింహులు, ఎంపీడీవో చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు సైకిళ్ల వితరణ



యాదమరి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): డీకేచెరువు జడ్పీ ఉన్నత పాఠశాలలోని తొమ్మిది మంది పేద విద్యార్థినులకు దాత నెయిల్ ఫెయిర్‌లాంబ్ సహకారంతో సైకిళ్లను షేర్ జీసస్ వర్డ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జోసెఫ్ (యు.ఎస్) శుక్రవారం అందజేశారు. హెచ్ఎం మజీద్ సాహెబ్, మహేష్, ఉపాధ్యాయులు జగన్నాథరావు, గిరిబాబు, మణి, దేవానంద్, మురళి, చాముండేశ్వరి, మురాద్ షా తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు దుప్పట్ల పంపిణీ



నగరి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నగరి నియోజకవర్గ కాపు సంఘ అధ్యక్షుడు ఎం.వి.బాబు ఆధ్వర్యంలో మెప్మా కార్యాలయంలో శుక్రవారం జాతీయ క్యాన్సర్ అవగాహన దినంపై సదస్సు నిర్వహించారు. నగరి టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుణశేఖర్ మాట్లాడుతూ కాపు సంఘం ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టడంపై సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం 40 మంది మున్సిపల్ కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, వైద్యులు మంజుల, మహేష్ ప్రసంగించగా, మెప్మా సూపర్‌వైజర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

బంగారుపాళ్యం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గుండ్లకట్టమంచి, తంబుగానిపల్లె, నలగాంపల్లె, బొమ్మాయిపల్లె, ఊటువంక గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను నియోజక వర్గ ఓటరు నమోదు అధికారి విజయలక్ష్మి శుక్రవారం పరిశీలించారు. 18 ఏళ్లు నిండేవారంతా ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు.

విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించాలి

వెదురుకుప్పం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించాలని ఉపాధ్యాయ వాణి ప్రధాన సంపాదకుడు గాజుల నాగేశ్వరరావు సూచించారు. శుక్రవారం కార్వేటినగరంలోని ప్రధాన పాఠశాలలో జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి అరగొండ హేమచంద్రారెడ్డి, జిల్లా నాయకులు ఆటుకారు చంద్రశేఖర్, శివశంకర్, కార్తీక్, వెంకటేశు, సర్దార్, దేవయ్య, గురవయ్య, ఎస్ఆర్ఎస్ యాదవ్, సురేష్, వేణు, శివాజీ, యుగంధర్, మురుగేష్, అమరనాత్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా ఎస్టీయూ సభ్యత్వ నమోదు

కార్వేటినగరం మండలంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం టీచర్ల నుంచి ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం చురుగ్గా జరిగింది.

జడ్పీ హైస్కూల్‌లో 'స్కౌట్స్ అండ్ గైడ్స్' ప్రారంభం



నింద్ర, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్‌ను హెచ్ఎం, గైడ్ కెప్టెన్ సునీత, తిరుపతి జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ వెంకటేశ్వరులు ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టరుతో ఢీకొట్టి, రాళ్లతో దాడి చేశారు

- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు


గాయపడిన రాజేంద్రన్

వెదురుకుప్పం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తనను ట్రాక్టరుతో ఢీకొట్టి, రాళ్లతో దాడి చేశారని ఎస్ఆర్‌పురం మండలానికి చెందిన వ్యక్తి శుక్రవారం కార్వేటినగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉడమలకుర్తి పంచాయతీ తుంగమిట్ట కాలనీకి చెందిన ఎం.రాజేంద్రన్ తన ఇంటి అవసరాలకు కార్వేటినగరం మండల పరిధిలోని కుశస్థలీ నదిలో ఇసుకను తీసుకుంటున్నాడు. ఆ సమయంలో తమ గ్రామానికే చెందిన జి.వినోద్‌కుమార్ దౌర్జన్యంగా ట్రాక్టరుతో ఢీకొట్టి, ఆపై రాళ్లతో దాడిచేసి గాయపరిచాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై సీఐ హనుమంతప్ప మాట్లాడుతూ.. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని శుక్రవారం రాత్రి తెలిపారు.

గొడ్డుకాలువలో ముందస్తు సహాయక చర్యలు


గురువారం రాత్రి స్థానికులకు సూచనలిస్తున్న సీఐ నెట్టికంఠయ్య

చిత్తూరు అర్బన్, నవంబరు 7 (ఆంధ్ర జ్యోతి): చిత్తూరు నగరంలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు సంతపేట గొడ్డుకాలువ పొంగి ప్రవహిస్తోంది. ఎస్పీ తుషార్ ఆదేశాలతో డీఎస్పీ సాయినాథ్ పర్యవేక్షణలో రెండో పట్టణ సీఐ నెట్టికంఠయ్య, సిబ్బంది ముందస్తు సహాయక చర్యలు చేపట్టారు. లోతట్టు ప్రాంతాల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. నగరపాలక, రెవెన్యూ సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ రాత్రంతా మానిటరింగ్ చేశారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే 112 లేదా 9440900005కు సమాచారం ఇవ్వాలని శుక్రవారం సీఐ సూచించారు.

సంక్షిప్తంగా..

విద్యార్థికి అభినందన



శ్రీరంగరాజపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న టి.జోగింధర్ జిల్లా స్థాయిలో జరిగిన జావెలిన్ త్రో, హైజంప్ పోటీల్లో సత్తాచాటాడు. దీంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని హెచ్ఎం హేమాద్రి నాయుడు తెలిపారు. శుక్రవారం ఈ విద్యార్థిని పీటీ రూపవతి, టీచర్లతో కలిసి అభినందించారు.

రఘురామన్‌కు సత్కారం



చిత్తూరు అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నేర పరిశోధనలో ప్రతిభ చూపి జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డును అందుకున్న చిత్తూరు క్రైమ్ స్టేషన్‌కు చెందిన రఘురామన్‌ను శుక్రవారం సన్మానించారు. చిత్తూరు పార్లమెంటు తెలుగు యువత అధికార ప్రతినిధి వల్లేరు అమరనాథనాయుడు, సీఐ ఉమా మహేశ్వరరావు, ఎస్ఐ హరినాయక్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం

గంగాధరనెల్లూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గారంపల్లె గ్రామానికి సమీపంలోని నీవానది ఏటి ప్రాంతంలో మృతదేహం లభ్యమైంది. ఏఎస్ఐ మురళీప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. నది ఏటిలో పురుషుడి మృతదేహం ఉన్నట్లు స్థానికులు సమాచారం ఇచ్చారు. 30-40 ఏళ్ల మధ్య వయసు ఉంటుందని, మృతదేహం పురుగులు పట్టి దుర్గంధం వస్తోందన్నారు. వీఆర్వో నరేష్ ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

'బహిష్కృత నేతలను పార్టీలో చేర్చుకోవాలి'

వెదురుకుప్పం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): 'వైసీపీ నుంచి బహిష్కరించిన పాలసముద్రానికి చెందిన ఎంపీపీ శ్యామల భర్త శివప్రకాష్‌రాజు, వెదురుకుప్పానికి చెందిన వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పేట ధనంజయులురెడ్డిని తిరిగి పార్టీలోకి చేర్చుకోవాలి' అని తమ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డిని కోరినట్లు ఆ పార్టీ నేతలు శుక్రవారం తెలిపారు. ఈ మేరకు భూమనను తిరుపతిలో కలిశామని వైసీపీ రాష్ట్రకార్యదర్శి మహాసముద్రం దయాసాగర్‌రెడ్డి, నాయకులు సురేష్‌రెడ్డి, ధనంజయులురెడ్డి, శివప్రకాష్‌రాజు, బాబురెడ్డి, భీమశంకర్‌రెడ్డి, కమలాకర్‌రెడ్డి, నారాయణరెడ్డి పేర్కొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన

యాదమరి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జాతీయ క్యాన్సర్ అవగాహన దినం సందర్భంగా మండలంలోని పీహెచ్‌సీ వద్ద వైద్యాధికారి డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ జరిగింది. సంతగేటు గ్రామంలో మానవహారం నిర్వహించారు. సీహెచ్‌వో శ్రీనివాసమూర్తి, వైద్యసిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

తవణంపల్లె: మండల కేంద్రంలో జరిగిన ర్యాలీలో వైద్యాధికారులు ప్రియాంక, మోహన్ వేలు తదితరులు పాల్గొన్నారు.

గుడిపాల: బొమ్మసముద్రం పీహెచ్‌సీ డాక్టర్ రష్మిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక జూనియర్ కళాశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నింద్ర: పీహెచ్‌సీ నుంచి బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. వైద్యులు సుమలత, వినీషా, లత, డీవైఈవో గోపి, హెచ్ఎస్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విజయపురం: పీహెచ్‌సీలో జరిగిన ర్యాలీలో వైద్యాధికారులు విష్ణుప్రియ, వనజ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

15న ద్విచక్ర వాహనాల వేలం

నగరి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వివిధ కేసుల్లో పట్టుబడిన ద్విచక్రవాహనాలకు ఈనెల 15వ తేదీన వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు ప్రభుత్వం నిర్ణయించిన ధరలో 10 శాతం ధరావత్తు సొమ్మును ముందుగా చెల్లించాలన్నారు. వేలంలో వాహనం దక్కించుకున్నవారు చలానాతోపాటు జీఎస్టీ చెల్లించి వాహనం తీసుకోవాలన్నారు. లేదంటే ధరావత్తు వదులుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

వందేమాతరం గీతాలాపన

చిత్తూరు సెంట్రల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వందేమాతరం గీతాన్ని రచించి 150 ఏళ్లు అయింది. ఈ సందర్భంగా శుక్రవారం జిల్లావ్యాప్తంగా సామూహిక వందేమాతరం గీతాలాపన చేశారు. గిరింపేటలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం మోహన్, బీజేపీ సీనియర్ నేత చిట్టిబాబు, కోటా కిరణ్, కరణాకర్ సిద్దు, పాండియన్, షంషేర్, మస్తార్, ఉదయ్‌కుమార్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు సిటీ: జిల్లా టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్, నేతలు మోహన్‌రాజ్, మేషాక్, రాణి, అరుణ, ప్రతిభ తదితరులు పాల్గొన్నారు.

ఐరాల(కాణిపాకం): మండలంలోని అన్ని పాఠశాలల్లో వందేమాతరం గీతాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆలపించారు. అనంతరం టీవీలో ప్రధాని మోదీ ప్రసంగాన్ని వినిపించారు. కాణిపాకం జడ్పీ హైస్కూల్ హెచ్ఎం గోపినాథ్‌రెడ్డి, ఉపాధ్యాయులు కృష్ణవేణి, యుగంధర్‌రెడ్డి, సోమశేఖర్‌నాయుడు పాల్గొన్నారు.

పాలసముద్రం: ఎంపీడీవో కార్యాలయం నుంచి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించి, వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఎంపీడీవో సతీష్, తహసీల్దార్ గుర్రప్ప, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్స్‌పాల్ హేమలత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యాదమరి: మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్ విద్యార్థులతో కలిసి డిప్యూటీ కలెక్టర్, పూతలపట్టు ఆర్వో విజయలక్ష్మి ర్యాలీ, మానవహారం నిర్వహించారు. అనంతరం మండలపరిధిలోని పోలింగ్ బూత్‌లను తనిఖీ చేశారు. తహసీల్దార్ పార్థసారథి, ఎంఈవో రుక్మిణి, ఎస్ఐ ఈశ్వర్, పలుశాఖల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి వందేమాతరం గీతాన్ని చిత్తూరు డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి ఇందిర ఆలపించారు. ఇన్‌చార్జి హెచ్ఎం జనార్ధన్‌రెడ్డి, టీచర్లు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: కార్వేటినగరంలోని లక్ష్మీనరసింహా హైస్కూల్, జూనియర్ కళాశాల సముదాయంలో జరిగిన కార్యక్రమాల్లో సీఐ హనుమంతప్ప, ట్రైనీ ఎస్ఐ రమేష్, కరస్పాండెంట్ దిలీప్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.



బంగారుపాళ్యంలో విద్యార్థులతో కలిసి వందేమాతరం గీతాన్ని ఆలపిస్తున్న డీవైఈవో ఇందిర - చిత్తూరు టీడీపీ కార్యాలయంలో గాంధీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నేతలు